హైదరాబాద్ వార్త

# విదేశీ మద్యానికి క్రేజ్

**నగరంలో అధికశాతం ఫారిన్ లిక్కర్ వినియోగం**

**ఖరీదైన మద్యం కొనేందుకు ఆసక్తి**

**రోజురోజుకూ పెరుగుతున్న అమ్మకాలు**



హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: నగరంలో విదేశీ మద్యానికి క్రేజ్ పెరుగుతుంది. విదేశాల నుండి వచ్చే వివిధ రకాల బ్రాండ్‌లకు నగరంలోని మద్యం ప్రియులు ఫిదా అవుతున్నారు. దీనికితోడు విదేశీ మద్యం తాగడం అన్నది హోదాకు చిహ్నంగా మారిపోతుంది. ఏచిన్నఫంక్షన్ కానీ, బందువులు స్నేహితులు కలిసినప్పుడు మద్యం తాగాలనుకుంటే మాత్రం పక్కాగా విదేశీ మద్యానికి పెద్దపీట వేస్తున్నారు. ఈకారణంగానే విదేశీమద్యం అమ్మకాలు పెరుగుతున్నాయి. గతంలో అయితే ఫారిన్ లిక్కర్ దొరికేది కాదు. దొంగ చాటుగా అమ్మేవారి నుండి కొనేవారు. కానీ గ్లోబలైజేషన్ నేపథ్యంలో నగరంలోనూ పెద్దసంఖ్యలో మద్యం మాల్స్ వెలుస్తున్నాయి. జంటనగరాల్లో ప్రతిమద్యం దుకాణంలోనూ ఏదోఒక విదేశీ బ్రాండ్ దొరుకుతుందంటే విదేశీ మద్యానికి ఏస్థాయిలో క్రేజ్ పెరిగిందో తెలుసుకోవచ్చు. తాజాగా నగంరలో మద్యం అమ్మకాల్లో 40శాతం వాటా విదేశీ మద్యానిదేనని వ్యాపారులు తెలుపుతున్నారు. మద్యం వ్యాపారులు సైతం ఆకర్షనీయమైన డిస్‌ప్లే,ఎయిర్ కండీషన్ షోరూంలను ప్రారంభిస్తూ మద్యం ప్రియులను ఆకట్టుకుంటున్నారు.

**పెరిగిన అమ్మకాలు..** గతకొంత కాలంగా విదేశీ మద్యానికి క్రేజ్ ఉన్నా.. నెల రోజులుగా నగరంలో గత ఏడాదికంటే 10శాతం అమ్మకాలు పెరిగినట్లు ఎక్సైజ్ అధికారులు తెలుపుతున్నారు. మూడు నెలల్లో మద్యం అమ్మకాల విషయానికొస్తే అంతకుముందు నెలకు 220కోట్లకు మద్యం అమ్మకాలు జరగ్గా..ప్రస్తుతం 300కోట్లకు చేరుకున్నట్లు అధికారులు తెలుపుతన్నారు. ఇందులో 30నుండి 40శాతం విదేశీ మద్యానిదే ఉంటుందని భావిస్తున్నారు. చాలామంది వినియోగదారులు తమ హోదాను చాటుకునేందుకు విదేశీ మద్యం కొనుగోలు చేస్తున్నారు. ధర ఎక్కువగా ఉన్న అంతగా పట్టించుకోవడం లేదు. అయితే విదేశీ మద్యం ద్వారా 10నుండి 15శాతమే కమీషన్ వస్తున్నా..వ్యాపారులు వాటినే అమ్మేందకు ఇష్టపడుతున్నారు. దేశీయ మద్యానికంటే విదేశీ మద్యం ధరలు ఎక్కువగా ఉండటం, ఎక్కువ టర్నోవర్ సాధిస్తే ఎక్కువ లాభం వస్తుందని చాలా మంది వ్యాపారులు భావిస్తున్నారు. నగరంలో విదేశీమద్యం అమ్మకాలు ఏస్థాయిలో జరుగుతున్నాయంటే రోజు10 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందని అమ్మకందారులు చెబుతున్నారు. లెక్కకు వచ్చేది అంతయితే లెక్కలేకుండా అమ్మేదికూడా మరో పదికోట్లవరకు ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు. నగరంలో సంపన్నవర్గాలను టార్గెట్ చేసుకుని వెలుస్తున్న విదేశీ మద్యానికి ఎగువ మధ్యతరగతి వారు కూడా ఆకర్షితులవుతున్నారు.

## ఎగ్‌ఉడ్ బోర్డ్స్ కంపెనీలో అగ్ని ప్రమాదం

**సకాలంలో స్పందించిన సిబ్బంది : తప్పిన ముప్పు**

ఉప్పల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : ఉప్పల్ నుంచి రామంతాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న ఎగ్‌ఉడ్ బోర్డ్స్ అండ్ ప్యానల్స్ కంపెనీ గోదాంలో శనివారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. సిబ్బంది సకాలంలో స్పందించి ఫైర్ స్టేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఇంజన్లు చేరుకుని మంటలు అదుపులోకి తీసుకుని వచ్చాయి. నగరంలో ఇటీవల వరుసగా జరుగుతున్న అగ్ని ప్రమాదాలతో నగర వాసులు తీవ్ర భయాందోళనలకు గురి అవుతుండగా మరోమారు ఉప్పల్‌లో అగ్ని ప్రమాదం జరుగడం తీవ్ర కలకలం రేగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ నుంచి రామంతాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలోని ఎగ్‌ఉడ్ బోర్డ్స్ అండ్ ప్యానల్స్ కంపెనీ గోదాం గత 30 సంవత్సరాలుగా నడుస్తోంది. ఈ కంపెనీలో ప్లైవుడ్‌కు సంబంధించిన వివిధ వస్తువులు తయారు చేసి సరఫరా చేస్తారు. ఇదే క్రమంలో శుక్రవారం కంపెనీలో ఉద్యోగులు విధులు ముగించుకుని వెళ్లిన తర్వాత శనివారం తెల్లవారుజామున కంపెనీ గోదాం మొదటి అంతస్థులో మంటలు చెలరేగాయి. దీంతో గమనించిన సెక్యూరిటి సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే మొదటి అంతస్థులో ఉన్న ప్లైవుడ్ కాలిపోయింది. మూడు ఫైర్ ఇంజన్లు చేరుకుని మంటలు అదుపులోకి తీసుకుని వచ్చాయి. జిహెచ్ఎంసి, ఫైర్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేస్తున్నారు. కంపెనీలో ఫైర్ నిబంధనలను తనిఖీ చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గోదాంలో ఉన్న సుమారు 12 లక్షల విలువైన ప్లైవుడ్ కాలిపోయినట్లు ఎగ్‌ఉడ్ బోర్డ్స్ అండ్ ప్యానల్స్ అసిస్టెంట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మద్దూరి సుబ్రహ్మణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. షార్ట్‌సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు. దీనిపై విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రామంతాపూర్ ప్రధాన రహదారిలోని ఎగ్‌ఉడ్ ప్లైవుడ్ గోదాం మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

## నేటి తరానికి మగ్దూం సాహిత్య స్ఫూర్తిని చాటి చెప్పాలి

**ఎమ్మెల్సీ గోరటి వెంకన్న**



కార్యక్రమంలో పాల్గొన్న సుప్రసిద్ధ కవి,ఎమ్మెల్సీ గోరటి వెంకన్న,రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

చార్మినార్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : సమకాలీన సామాజిక పరిస్థితులలో మగ్దూం సాహిత్య స్ఫూర్తిని మరింత విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని సుప్రసిద్ద కవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. సిటీ కళాశాల పూర్వ అధ్యాపకులైన మగ్దూం పేరున జాతీయ పురస్కారాన్ని ఉత్తమ సాహిత్య వేత్తలకు 2019 నుంచి ప్రధానం చేస్తున్నారు. 2022 సంవత్సరానికి కవి జయరాజ్‌కు 2033 సంవత్సరానికి ఆంధ్రజ్యోతి ప్రధాన సంపాదకులు డా.కె.శ్రీనివాస్‌కు శనివారం ప్రభుత్వ సిటీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సిటీ కళాశాల మగ్దూమ్ మొహియుద్దీన్ నేషనల్ అవార్డులను ప్రధానం చేశారు.శ్రీనివాస్, జయరాజ్‌లకు పదివేల నగదు, జ్ఞాపిక ధృవపత్రం అందజేసి శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ మగ్దూం తాత్విక చైతన్యాన్ని తమ రచనల ద్వారా చాటి చెప్తున్న ఆంధ్రజ్యోతి ప్రధాన సంపాదకులు కె.శ్రీనివాస్, కవి.జయరాజ్‌లకు ఈ పురస్కారం ఇవ్వటం అత్యంత సముచిత నిర్ణయమని కొనియాడారు.విశిష్ట అతిధిగా విచ్చేసిన రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ కవిగా,నాటక కర్తగా,ఆనాటి తెలంగాణ సమాజంపై మగ్దూం చూపిన ప్రభావానికి నేటికీ ప్రాసంగికత ఉన్నదని,వర్తమాన పరిస్థితులలో అతని మార్గం అనుసరణీయమని తెలిపారు. ప్రముఖ కవి యాకూబ్ మాట్లాడుతూ మగ్దూం చూపిన బాటలో మనమంతా నడవ వలసిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అవార్డు కమిటి చైర్మన్, సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.బాల బాస్కర్,అవార్డు కమిటి కన్వీనర్ డి.విప్లవ దత్ శుక్లా, సభ్యులు డి.యాదయ్య, డా.రత్న ప్రభాకర్, డా,కోయి కోటీశ్వరరావు, పూర్వ ప్రిన్సిపాల్ డి.వెల్చాల కొండలరావు,మగ్దూం కుమారుడు జాఫర్ మొహియుద్దీన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మున్సిపల్ కౌన్సిల్ ఆస్తి పన్ను విధానాన్ని ఉపసంహారించుకోవాలి



మున్సిపల్ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపి నాయకులు

నిజాంపేట్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో 12శాతం ఇంటి పన్ను 36శాతం వాణిజ్య పన్ను నిర్ధారిస్తూ మున్సిపల్ కౌన్సిల్ చేసిన తీర్మానంపై బీజేపి నాయకులు మున్సిపల్ అధికారికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపి నాయకులు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో రెండింతల ఆస్తి పన్ను విధానం వద్దని, జీహెచ్ఎంసీ తరహా ఒకే పన్ను విధానం ఉండాలన్నారు. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానించిన విధంగా పన్ను విధిస్తే ఇంటి పన్నురెండు రెట్లు అధికమవుతుందని, వెంటనే ఈ విధమైన తీర్మానాన్ని ఉపసంహారించుకోవాలని బీజేపి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆస్తి పన్ను విధానం వెంటనే రద్దు చేయకుంటే ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు పాల్గొన్నారు.

## డిసిఎం అదుపుతప్పి ఇద్దరు దుర్మరణం

**డివైడర్‌ను ఢీకొట్టిన మేఘా ఇంజినీరింగ్ డిసిఎం**

**డిసిఎంలో 16మంది సిబ్బంది**

**ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరి దుర్మరణం**

**గాయాలపాలైన 14 మంది, ఇద్దరి పరిస్థితి విషమం**

దుండిగల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : 16మంది సిబ్బందితో బయలుదేరిన డిసిఎం వాహానం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీకొట్టింది. ఈప్రమాదంలో ఇద్దరు సిబ్బంది అక్కడికక్కడే దుర్మరణం చెందగా 14 మంది తీవ్రగాయాలపాలవగా వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈదుర్ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మేఘా ఇంజినీరింగ్ సంస్థకు చెందిన డిసిఎం(టిఎస్08యుహెచ్4319) వాహానం వివిధ విభాగాలకు చెందిన 16మంది సిబ్బందిని ఎక్కించుకొని శనివారం తెల్లవారుజామున నగరశివారులోని గౌడవెల్లి నుండి సచివాలయం సమీపంలోని ఎన్టీఆర్‌గార్డెన్‌కు బయలుదేరింది. గండిమైసమ్మ చౌరస్తా దాటి శ్రీరామ్‌నగర్ వద్దకు చేరుకోగానే అదుపుతప్పిన డిసిఎం డివైడర్‌ను ఢీకొట్టి పల్టీకొట్టడంతో అందులో ఉన్న సిబ్బంది చెల్లాచెదురుగా పడి పోయారు. ఈప్రమాదంలో చంద్రమౌళి(50), కిరణ్(35)లు అక్కడికక్కడే మృతిచెందగా మిగతా 14మంది తీవ్రగాయాలపాలైయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స కోసం సూరారంలోని మల్లారెడ్డి వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు సునిల్, వికాస్ అనే ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను గాంధీకి తరలించి దర్యాప్తు చేపట్టారు. కాగా డిసిఎం డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం ప్రమాదానికి కారణంగా పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తుంది



మృతిచెందిన కిరణ్, చంద్రమౌళి

**ప్రమాదాలకు నిలయంగా శ్రీరామ్‌నగర్..** దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలానగర్–నర్సాపూర్ ప్రధానరహదారి పక్కన ఉన్న శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో వరుస ప్రమాదాలు చోటు చేసుకోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత డిసెంబర్‌లో ఓ స్కూల్ బస్సు శ్రీరామ్‌నగర్ వద్ద యూటర్న్ తీసుకునే క్రమంలో లారీ ఢీకొట్టింది, ఈప్రమాదంలో స్కూల్ బస్సు అద్దాలు ధ్వంసం అవడంతో పాటు టీచర్ తీవ్రగాయాలపాలవగా అందులో ఉన్న విద్యార్థులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కొద్ది రోజుల క్రితం ఆర్ఎసం కాంక్రీట్ లారీ ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు.

స్కూల్ బస్సు ఘటనతో భయాందోళనకు గురైన స్థానికులు సరియైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆందోళనకు దిగారు. స్పందించిన ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు, మున్సిపల్ అధికారులు హెచ్చరిక బోర్డులతో పాటు ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని హామినిచ్చారు. అనంతరం తాత్కలిక డివైడర్‌లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. అయితే హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా సరియైన చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## బడ్జెట్‌లో మైనార్టీలకు కోత విధించడం అన్యాయం

చిక్కడపల్లి,ఫిబ్రవరి 4ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనారిటీవర్గాలకు కోత విధించడం అన్యాయమని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరూసలేం మత్తయ్య తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది కేటాయింపులలో మైనారిటీవర్గాలకు తీరని అన్యాయం జరిగిందని, గతేడాది మైనారిటీలకు కేటాయించిన బడ్జెట్‌లో రూ.5.020కోట్లు కాగా 2023-24లో అదికాస్తా రూ.3097.60 కోట్లకు తగ్గించారని విమర్శించారు. ఈ బడ్జెట్ పేదలకు, అల్పసంఖ్యాకవర్గాలకు ఏమాత్రం మేలు జరిగే విధంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి ఆవాజ్‌యోజన పథకానికి 2023-24 బడ్జెట్‌లో నిధులు రూ.79వేలకోట్లు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. వడ్డీరేట్లు పెరిగిన ఈసమయంలో గృహ కొనుగోలుదారులకు ఇది ఊరట కల్పించే విషయమని, సవరించిన అంచనాల ప్రకారం 2023-24లో ద్రవ్యోలోటు జీడీపీలో 5.9శాతమని, ఇది ప్రజలకు కొంత ఊరట కలిగించే అంశమన్నారు. మహిళలకు 7.5శాతం వడ్డీతో ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం ప్రవేశపెట్టడం వల్ల వారికి మేలు జరుగుతోందని మత్తయ్య అన్నారు. మహిళల కోసం 'మహిళా సమ్మాన్ సర్టిఫికేట్' తీసుకురావడం, రెండేళ్ళ కాలానికి ఈ పథకం అందుబాటులో ఉంటుందని, ఈ పథకంలో ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై 7.5శాతం స్థిరవడ్డీ ఇస్తారని, ఇది వారి అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు.

## విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని 'చలో అసెంబ్లీ ముట్టడి'

**పిడిఎస్‌యు విద్యార్థుల అరెస్టు**



అసెంబ్లీ ఎదుట విద్యార్థులను అరెస్టు చేస్తున్న పోలీసులు

సైఫాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్‌యుకు చెందిన ఆనేక మంది విద్యార్థులు శనివారం 'చలో అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమం చేపట్టారు. పిడిఎస్‌యు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన ఆనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ముట్టడి సందర్భంగా పోలీసులు అరెస్టుల పరంపర కొనసాగించారు. విద్యార్థులు నాలుగు దఫాలుగా అసెంబ్లీలో చోరబడే ందుకు ప్రయత్నించగా పోలీసులు బహు చాకచక్యంతో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రామకృష్ణ, నామాల అజాద్ మాట్లాడుతూ చలో అసెంబ్లీ సందర్భంగా పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా రెండు వందల మంది విద్యార్థులను నిన్నటి నుంచి వెంబడించి అరెస్టుల పరంపర కొనసాగించి రెండు వందల మందిని అరెస్టు చేశారని ఆరోపించారు. కనీసం నిరసన తెలిపే హక్కు లేకుండా ప్రభుత్వం చేస్తున్నదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కెజి టూ పిజి వరకు ఉచిత విద్యను అందిస్తామని ప్రకటించిన సిఎం కెసిఆర్ కనీసం విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా కుంటి సాకులతో పాఠశాలలను మూసివేస్తున్నదని 6వ తేదీన ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, స్కాలర్‌షిప్‌లు, ఫీజుల బకాయిలు చెల్లించాలని పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించాలని, ఆశాస్త్రీయమైన విద్యను విద్యార్థుల మెదళ్ళకు చొప్పించే జాతీయ విద్యా విధానాన్ని అసెంబ్లీలో బర్తరఫ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ముట్టడిలో పిడిఎస్‌యు నాయకులు పృథ్వి, నరేందర్, సంధ్య, నరసింహారావు, సురేష్, అజయ్, గణేష్, సీతారాం, రాకేష్, సతీష్, దీపికా, అసుర్, పవిత్ర, సింహాద్రి, నాగరాజు, మారుతి, దుర్గాప్రసాద్, కరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## దరువు అంజన్నకు జానపద కళానిధి బిరుదు ప్రదానం



కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : తెలంగాణ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించి ఉద్యమకారులు ఉత్తేజాన్ని నింపిన ఉద్యమనేత దరువు అంజన్నకు జానపద కళానిధి బిరుదును దుబ్బాక శాసనసభ్యులు రఘునందన్ రావు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన సిద్ధిపేట జిల్లా రాయపోల్ గ్రామంలో జన్మించి తన పాటలను ఖండాంతరాలు దాటించిన ఘనత అంజన్నదని తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో అలుపెరగని పోరుసల్పి, వీరులారా వందనం విద్యార్థి అమరులారా వందనం అంటూ ఊరురా వాడవాడ తెలంగాణ నినాదాన్ని వినిపించాడని కొనియాడారు. తుపాకీ గుళ్ళను సైతం లెక్క చేయకుండా ఉస్మానియా యూనివర్శిటీలో ఓయూ జేఏసీ చైర్మన్‌గా ఎన్నో సేవలు అందించారని అంజన్న సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం వివిధ అవార్డులు ఇచ్చి సత్కరించిందన్నారు. మాస్టర్ జి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన 45 సంవత్సరాల వార్షికోత్సవ కార్యక్రమంలో దరువు అంజన్నను ఎమ్మెల్యే రఘునందన్‌రావు, మాస్టర్ జి ఫౌండేషన్ జానపద కళానిధి అనే బిరుదును అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు శంకర్, ప్రజాహిత ఫౌండేషన్ చైర్మన్ మామిడి మోహన్‌రెడ్డి, రాయపోల్ కృష్ణారెడ్డి, జిలాల బిజెపి నాయకులు బాగన్న రవీందర్‌రెడ్డి, అందెఆర్ట్స్ ఆకాడమీ చైర్మన్ అందె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ఎల్లప్పుడు సుఖ సంతోషాలతో జీవించాలి : జంపనప్రతాప్



న్యూ సిటీ వెంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్

కంటోన్మెంట్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: ప్రజలు ఎల్లప్పుడు ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. శనివారం కంటోన్మెంట్ 1వ వార్డు న్యూసిటీ కాలనీలో ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంలో ఆలయం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అరుణ్ యాదవ్, టీంకూగౌడ్, అజయ్ యాదవ్, స్వాములు నరేశ్, భూషణం, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కళలను భవిష్యత్తు తరాలకు అందించాలి : మామిడి హారికృష్ణ



వార్షికోత్సవ వేడుకల్లో కళలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

మెహిదీపట్నం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : కళలను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందిరిపై ఉందని, తెలంగాణ ప్రభుత్వం కళల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకు మామిడి హారికృష్ణ తెలిపారు. రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత తెలంగాణ కళలు, సాహిత్యం తేజోమూర్తుల గురించి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అపూర్వమైనదన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో నడుపబడుచున్న అన్నమాచార్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల వార్షికోత్సవ వేడుకలు, సద్గురు త్యాగరాజ స్వామి వారి 176వ సంగీత ఆరాధనోత్సవము కార్యక్రమాలను శనివారం గుడిమల్కాపూర్ సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గురు త్యాగరాజ స్వామి వారి పంచరత్న కీర్తనల గోష్ఠిగాన ముతో పాటు కళాశాల విద్యార్థిని, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మామిడి హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాభవన్ కేంద్రంగా జరుగుతున్న సాంస్కృతిక ప్రదర్శనలు తెలంగాణ భాషను, సంస్కృతిని, తెలంగాణ అస్తిత్వాన్ని పతాక స్థాయిలో ప్రదర్శిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధి యం. రామరాజు, సాయిబాబ దేవాలయ కమిటీ సభ్యులు శివకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ యస్.వి.రమణమూర్తి, సికింద్రాబాద్ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ కె. వరలక్ష్మి, అధ్యాపకులు శారద, లావణ్యలత, జయలక్ష్మి, రాజగోపాలచారి, నాగేశ్వరరావు, ఎస్.వి.రమణమూర్తి, జయకుమార్, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## ఆర్టీసికి రోజు రూ.18కోట్ల ఆదాయం వస్తుంటే.. ఉద్యోగులకు జీతాలు ఎందుకు ఇవ్వరు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: ఆర్టీసికి రోజు రూ.18కోట్లు ఆదాయం వస్తుంటే ఉద్యోగులకు ప్రతి నెల జీతాలు ఎందుకు ఇవ్వడం లేదని ఆర్టీసి తెలంగాణ మజ్దూర్ యూనియన్‌ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మొదటి తేదీన డ్రైవర్, కండక్టరల్‌లకు ఇచ్చి మిగతా వారికి ఇవ్వకపోవడం చాలా అన్యాయమన్నారు. ఆర్టీసి సంస్థ యూనియన్ బ్యాంక్ ద్వారా చేసుకున్న ఒప్పందం ఏమైందని ప్రశ్నించారు. ఇదే విషయంపై చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను కూడా కలవడం జరిగిందని, సంస్థ స్టేట్‌బ్యాంక్‌లో ఉన్న ఖాతాలన్నీ ఏకధాటిగా రద్దుచేసి యూనియన్ బ్యాంక్ ద్వారా ఓడీ ఇప్పించి జీతాలు ఇప్పిస్తామని చెప్పి ఈ రోజు జీతాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం డ్రైవర్, కండక్టర్లకు మాత్రమే జీతాలు ఇచ్చి మిగతా వారికి ఎందుకు ఇవ్వలేదని, ఇది చాలా అన్యాయమన్నారు. మరోవైపు ఆర్టీసి ఎండి సజ్జన్నార్‌మాత్రం రాష్ట్రంలో 36 డిపోలు లాభాలలో నడుస్తున్నాయని చెబుతున్నారని, కాని షెడ్యూల్స్ అన్ని పోయాయని, బస్సులు కూడా తగ్గిపోయాయని, ఓఆర్ పెరిగితే అవి లాభాలుగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. గతంలో ఆర్టీసి ఎండిగా ఉన్న సునీల్‌శర్మ ఉన్న సమయంలో ప్రతి రోజు రూ.11కోట్లు లాభాలు వచ్చిన సందర్భంలో ప్రతి నెల జీతాలు అందరికి అందాయని, కాని ప్రస్తుతం రూ.18కోట్లు వస్తుంటే అందరికి జీతాలు ఎందుకు ఇవ్వడం లేదని, ఇంత మొత్తం డబ్బులు వస్తుంటే జీతాలు ఎందుకు సరిపోవడం లేదని అన్నారు. ప్రతి నెల ఆర్టీసిలో పనిచేస్తున్న వారందరికి మొదటి తేదీనే జీతాలు ఇవ్వాలని, గత 9సంవత్సరల నుంచి ఆర్టీసిలో జీతాలు పెంపు జరగలేదని, పదోన్నతులు లేవని, కష్టం ఎక్కువైందని, వెట్టిచాకిరి ఎక్కువైందన్నారు. రోజుకు 16 గంటలు డ్యూటీలు చేయిస్తున్నారని, ఇందులోచాలా మంది రిటైర్ అయ్యారని, సీనియర్ ఉద్యోగులు కూడా రిటైర్ అయ్యారని, లాభాలు వస్తున్న సమయంలో జీతాలు ఇవ్వడానికి ఎందుకు సమస్య వస్తోందని అన్నారు. సెస్సు రూపేణ, పాసుల రూపేణ,రౌండ్‌ఫిగర్ రూపేణ పెంచిన డబ్బుల విషయంపై ఆయన ఆరా తీశారు.

## స్టేడియం పనులు సత్వరమే పూర్తి చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్,అధికారులు

చార్మినార్,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఇండోర్ స్టేడియం పనులు సత్వరమే పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ జోనల్ కమిషనర్ అశోక్ సామ్రాట్,మున్సిపల్,ఇంజనీరు అధికారులతో కలిసి స్టేడియంలో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండోర్ స్టేడియంలోని పనులన్నింటినీ సత్వరమే పూర్తి చేయాలని కోరారు.ఈఈ నరేందర్‌గౌడ్,డిఇలు, ఎఇలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కార్ల రేసింగ్‌కు అందరూ సహకరించాలి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: ఖైరతాబాద్ ప్రాంతంలో అతి త్వరలో జరిగే కార్ల రేసింగ్‌నకు స్థానికంగా ప్రజలు, వాహనదారులు సమన్వయంతో సహకరించాల్సిన అవసరం ఉందని ఇటు ట్రాఫిక్, అటు లా అండ్ ఆర్డర్ పోలీసులు, పలువురు అధికారులు పేర్కొంటున్నారు. ఖైరతాబాద్ ఫ్లైఓవర్ చౌరస్తా, ఎన్టీఆర్ మార్ట్, ఐమాక్స్ తదితర ప్రాంతాలలో కారు రేసింగ్ జరుగుతున్న దృష్ట్యా రేసింగ్ పూర్తయ్యేంత వరకు సహకరించాలని వారు కోరుతున్నారు. గతంలో జరిగిన రేసింగ్ నకు సహకరించినట్లే జరుగబోయే కార్ల రేసింగ్‌నకు అందరూ కొందరు పోలీసు అధికారులు సూచిస్తున్నారు. ఆయా మార్గాల వెంట స్థానికంగా పలువురు ప్రజలు, వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉందన్న నేపథ్యంలో ముందుగానే అందరిలో సూచిస్తున్నట్లు వారు చెబుతున్నారు.

## 7న మాత రమాభాయి అంబేద్కర్ జయంతి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: మాత రమాభాయి అంబేద్కర్ 125వ జయంతి వేడుకలు ఈ నెల 7వ తేదీన ఘనంగా జరుగనున్నన్నాయి. రమాభాయి అంబేద్కర్ జయంతి వేడుకల సం దర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించనున్నారు. రమాభాయి జయంతి వేడుకలు ఖైరతాబాద్, చింతల్ బస్తీ, తుమ్మలబస్తీ, వీర్‌నగర్ ప్రాంతాలలో జరుగుతాయి.

## సామ్రాట్ విక్రమాదిత్య ఉత్సవాల భూమి పూజ



పూజలు నిర్వహిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ లోని హెచ్‌ఎంటి గ్రౌండ్స్‌లో ఈనెల 10,11,12 తేదీలలో జరగబోయే సామ్రాట్ విక్రమాదిత్య ఉత్సవాల కోసం శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు మురళీధర్‌రావు, కూకట్‌పల్లి బిజెపి ఇంచార్జ్ మాధవరం కాంతారావు, టీటీడీ బోర్డు అడ్వైజర్ కమిటీ సభ్యులు బిజెపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర రావు, బిజెపి రాష్ట్ర నాయకులు మల్లారెడ్డి పాల్గొన్నారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు



జి.జి.వై.ఎఫ్ చైర్మన్,బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: అబిడ్స్‌లోని చారిత్రాత్మకమైన ముత్యాలమ్మ దేవాలయంలో జరుగుతున్న మహోత్సవ వేడుకలల్లో గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్ని అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, మల్లికార్జున్, సతీష్‌గౌడ్, జయశంకర్ పాల్గొన్నారు.

## మోండా డివిజన్‌లో పెండింగ్ పనులు పూర్తి చేయాలి : కొంతం దీపిక



రెజిమెంటల్ బజార్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. శనివారం ఆమె రెజిమెంటల్ బజార్, చాపల బావి, కుమ్మరిగూడ పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగు నీటిలో మురుగునీరు కలుషితం అవుతుందని, డ్రైనేజీలు తరుచుగా పొంగి పొర్లుతున్నాయని, రోడ్లు, అస్తవ్యస్తంగా ఉన్నాయని స్థానికులు ఆమె దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొంతం నరేశ్, వీర వర్ధన్ గౌడ్ పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి



రోడ్డును ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

జీడిమెట్ల, ఫిబ్రవరి4 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్‌నగర్ డివిజన్ పరిధి సూరారంలోని రాజీవ్‌గృహకల్పలో రూ.38లక్షలతో చేపట్టిన రోడ్డును శనివారం మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ సహకారంతో డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటున్నామని, ప్రతి కాలనీ, బస్తీలలో మౌళిక వస తుల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. త్వరలోనే అసంపూర్తిగా ఉన్న భూగర్భ డ్రైనేజీ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి త్వరి తగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉండని ప్రాంతాలు

జీడిమెట్ల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి జీడిమెట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మత్తుల కారణంగా ఆదివారం సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలలో విద్యుత్ ఉండదని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీ, సుభాష్‌నగర్ ఆటో స్టాండ్, గంపలబస్తీ, వెంకటాద్రినగర్, అయిమాత టెంపుల్, సుభాష్‌నగర్ ఇండస్ట్రియల్ తదితర ప్రాంతా లలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ ఉండదు.

## వైభవ్‌నగర్ కాలనీలో రెండు కోట్లతో అభివృద్ధి పనులు



పార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కాలేరు వెంకటేష్. చిత్రంలో పద్మా వెంకట్‌రెడ్డి తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని వైభవ్‌నగర్‌కాలనీ రెండు కోట్ల రూపాయల తో పలు అభివృ ద్ధి పనులు చేపట్టడం జరిగిందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చెప్పారు. ఇందులో ఇప్పటికే కొన్ని పనులు పూర్తికాగా మరికొన్ని పనులను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. శనివారం నాడిక్కడ డివిజన్ కార్పోరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పార్కు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీ పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళడం జరిగింది. గాయిత్రి నగర్ నుంచి వైభవ్ నగర్ వరకు రోడ్డు నిర్మాణం చేట్టాలని, పార్కును అందంగా తీర్చిదిద్దాలని, వరదనీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పదిస్తూ వైభవ్ నగర్ పార్కును 75 లక్షలతో అందంగా, అహ్లాదకరంగా సుందరంగా తీర్చిదిద్దుతామని, పార్కులో ఫౌంటేన్, చుట్టు చైన్ లింక్ మెష్, బల్లలు, పచ్చటి గడ్డి పరుపు, అందమైన మొక్కలను ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు నిర్మాణాన్ని 30 లక్షలతో చేపడుతున్నామని, సిజన్స్ హాస్పటల్ వద్ద 25 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం పూర్తియిందని, గీతా కాన్వేంట్ స్కూల్ వద్ద 14 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం చేయడం జరిగిందని, వరద నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కారిస్తామని వివరించారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు రవి, హుస్సేన్, కాలనీ ప్రతినిధులు డాక్టర్ చారి, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, సిద్ధార్థ, వేణుగోపాల్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాదయాత్రలు

### గజ్జల యోగానంద్



కాలనీలలో పర్యటిస్తున్న యోగానంద్

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆయా డివిజన్‌లలో సమస్యల పరిష్కా రమయ్యే వరకు నిరంతరం పాదయాత్ర కొనసాగుతుందని శేరిలింగంపల్లి బిజెపి ఇంచార్జ్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే గజ్జల యోగానంద్ పేర్కొన్నారు. శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో విజయనగర్, సాయినగర్ నందూ ప్రజా సమస్యలను తెలుసుకొనుటకు యెగానంద్ పర్యటించారు. జిహెచ్ఎంసి వాళ్ళు శుభ్రం చేసిన కాలువలో చెత్త తీసి అదే రోడ్లమీద వేసి వెళ్ళిపోతున్న పరిస్థితి ఉందని ప్రజలు వాపోతున్నారు. విద్యుత్ స్థంబాల కొరత చాలా ఉందని విద్యుత్ తీగలు సరైన పద్ధతిలో లేక నేలపైకి ఒరుగుతున్నా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆందోన చెందుతున్నారని యోగానంద్ పేర్కొన్నారు. వీదిదీపాలు లేక 6 దాటితే బయటికి వెళ్ళా లి అంటే భయంగా ఉందని రోడ్డు గుంతలు గుంతలుగా ఉండడంతో ఎక్కడపడిపోతా మేమోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని యోగానంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విజిత్‌వర్మ, రవీందర్, రామరాజు, రఘు, రామకృష్ణ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

### ఉప విద్యాశాఖ అధికారి చిరంజీవి



అమరావతి స్పోర్ట్స్‌డేలో పాల్గొన్న ఉప విద్యా శాఖ అధికారులు చిరంజీవి, స్వరూప రాణి తదితరులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాలలో ప్రతిభకనబర్చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముషీరాబాద్ ఉప విద్యా శాఖ అధికారి చిరంజీవి, డిప్యూ టీ ఐఓఎస్‌లు శ్రీనివాస్ రాజ్, స్వరూప రాణిలు తెలిపారు. శనివారం సికింద్రాబాద్ మేడిబావిలోని అమరా వతి గ్రామర్ హై స్కూల్‌లో నిర్వహించిన మోడల్ వింగ్ పూనతన్ -23 స్పోర్ట్స్‌డే వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అమరావతి విద్యా సంస్థల నిర్వాహకులు ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్‌లు ప్రసన్న లక్ష్మి, కవితా రెడ్డి, వినా రెడ్డిలతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రికెట్, కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ రేస్, షాట్‌పుట్, క్యారమ్స్, మ్యూజికల్ చేర్స్‌వంటి క్రీడలు నిర్వహించి విజేతలకు ట్రోఫీ ప్రశంస పత్రాలు, బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి.

## రాజేంద్రనగర్‌లో హాత్‌సేహాత్ జోడోను విజయవంతం చేస్తాం : జ్ఞానేశ్వర్



రాజేంద్రనగర్ నియోజకవర్గంలో హాత్‌సేహాత్ జోడో యాత్ర విజయవంతం చేస్తామని పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి తెలుపుతున్న జ్ఞానేశ్వర్ ముదిరాజ్

నార్సింగి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : రాజేంద్ర నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హాత్‌సేహాత్ జోడో యాత్రను విజయవంతం చేస్తామని పిసిసి ప్రధాన కార్యదర్శి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. శనివారం గాంధీభవన్‌కు వెళ్లి పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డితో కలిసి హాత్‌సేహాత్ జోడో యాత్రపై జ్ఞానేశ్వర్ చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని సీనియర్, జూనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తామన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలపై ప్రజలు విసిగి వేసారి పోయారని, సంక్షేమం- అభివృద్ధి సమానంగా పరుగులు పెట్టాలంటే మళ్లీ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్న కసితో ఉన్నారన్నారు. దశాబ్దాల కాలంగా దేశాన్ని ఏలిని హస్తం పార్టీ పదేళ్ల కాలం అధికారంకు దూరమవ్వగానే ప్రజలు తల్లిలేని బిడ్డల్లా సమస్యల వలయంలో పడి విలవిల్లాడుతున్నారన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించే సమర్థత ఒక్క కాంగ్రెస్ పార్టీకే ఉందని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. నియోజకవర్గంలోని మూడు మున్సిపాల్టిలు, ఒక కార్పోరేషన్, నాలుగు గ్రేటర్ డివిజన్లు, ఇతర పంచాయతీలలో అన్నింటిలో సమావేశాలు నిర్వహించి హాత్‌సేహాత్ జోడా కార్యక్రమంను విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ శాఖ ఉపాధ్యక్షులు నరేంద్ర, శంషాబాద్ మండల అధ్యక్షులు శేఖర్ యాదవ్, మున్సిపల్ అధ్యక్షులు సంజయ్ యాదవ్, మైలార్‌దేవుపల్లి డివిజన్ అధ్యక్షులు ధనంజయ, బిబ్లాక్ అధ్యక్షులు ఖలీద్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి వ్యక్తుల అరెస్టు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: నిబంధనాలకు విరుద్ధంగా గంజాయి, మత్తు నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.నవనిత తెలిపిన వివరాల ప్రకారం కుత్బుల్లాపూర్‌కు చెందిన సొఖిల్ అలీ, బషీర్ మహ్మద్ అనే ఇద్దరు అన్నదమ్ములు కలిసి ద్విచక్రవాహనంపై సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో గంజాయిని రెగ్యులర్ కస్టమర్లకు విక్రయిస్తున్నారు. ప్యారడైజ్ సర్కిల్ వద్ద ద్విచక్రవాహనంపై గంజాయిని తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని వారి నుంచి కిలో గంజాయి, 200 గ్రాముల పాపీస్ట్రా అనే మత్తు పదార్థాలతో పాటు వారు ఉపయోగించిన ద్విచక్రవాహనాన్ని, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు సిఐ నవనిత తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచాక్యంగా వ్యవహరించిన ఎస్ఐలు ప్రేమ్‌కుమార్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రసాద్, మధులను అభినందించారు.

## వైభవంగా ముత్యాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలు



అమ్మవారి ఆలయ వార్షికోత్సవంలో టీఆర్ఎస్ నాయకులు

నిజాంపేట్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొ రేషన్ పరిధి ఎన్టీఆర్ నగర్ కాలనీలోని ముత్యాలమ్మ తల్లి దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, ఎన్ఎంసీ బీఆర్ఎస్ పార్టీ అధ్యదు రంగరాయ ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలం దరిపై ఉండాలని వేడుకున్నానన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆవుల పావని, రాజేశ్వరి, రాఘవేంద్రరావు, ఆలయ చైర్మన్ మంజునాథ్,శోభారాణీ, బీఆర్ఎస్ నాయకుడు గోపాల్ ముదిరాజ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ చొరవతో పీపుల్స్ పార్కులో విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ



పార్కును సందర్శించిన కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: చిక్కడపల్లిలోని పీపుల్స్‌పార్కు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పార్కులో గత కొన్ని నెలలుగా విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో స్థానిక కాలనీవాసులు చేసిన ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ పర్యటించారు. గత మూడు నెలలుగా కరెంట్ బిల్లు చెల్లించని కారణంగా విద్యుత్తు సరఫరా నిలిపివేశారన్న విషయాన్ని తెలుసుకున్న కార్పొరేటర్ వెంటనే విద్యుత్తు శాఖాధికారులతో చర్చించి త్వరలోనే పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని ఇచ్చిన హామీ మేరకు విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. అదే విధంగా పార్కులో ఉన్న నీటి బోరును మరమ్మత్తు చేయించి త్వరలోనే పునరుద్ధరిస్తామన్నారు. నగర బిజెపి నేత ఎ.వినయ్‌కుమార్, కాలనీవాసులు అధ్యక్షుడు గంగరాజు, శివకుమార్, రజనీకాంత్, మోహన్‌గౌడ్, రమేశ్, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: విద్యార్థులు మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని నల్లకుంట బ్రైట్ కిడ్ స్కూల్(నల్లకుంట) ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆ స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సామాజిక సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలన్నారు. విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు తమ విద్యాసంస్థ తరఫున ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని సత్కరించారు.

## సిపిని కలిసిన గోల్నాక కార్పొరేటర్ లావణ్య శ్రీనివాస్‌గౌడ్



సిపి సి.వి ఆనంద్‌తో కార్పొరేటర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త: హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి.ఆనంద్‌ను గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా గోల్నాక డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను సిపికి వివరించగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# స్థానికంగా ఉండే పోస్టాఫీసుల్లోనే పింఛన్ అందేలా కృషి చేస్తాం

### బండ్లగూడ జాగీర్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని డాన్‌బాస్కో పోస్టాపీసు వద్ద పింఛన్ కోసం నిలబడ్డ వృద్దులతో మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : ఆసరా పింఛన్లను స్థానికంగా ఉండే పోస్టాఫీసుల్లోనే అందేలా కృషి చేస్తామని బండ్లగూడ జాగీర్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ తెలిపారు. శనివారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో ఉన్న డాన్‌బాస్కో పోస్టాపీసు వద్ద ఆసరా పింఛన్ల కోసం లైన్లలో ఉన్న వృద్దులను కలిసి మాట్లాడారు. వారికి బిస్కెట్ పాకెట్లు, వాటర్ బాటెళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోస్టాఫీసు వద్ద ఆసరా పింఛన్లు వారం రోజుల పాటు పంపిణీ చేస్తారని, వృద్దులు అందరూ ఒకే రోజు వచ్చి ఇబ్బందులు పడవద్దని, రెండు రోజులకు ఓ ప్రాంతం వారు వచ్చి తీసుకుంటే ఇబ్బందులు రావన్నారు. ఒకే సారి 300మంది వచ్చి తోసుకోవడం, ఇబ్బందులు పడడం సరైంది కాదన్నారు. పోస్టాఫీసు ఉన్నతాధికారులతో చర్చించి ఎక్కడికక్కడే పింఛన్లు అందేలా వృద్దులకు హామీనిచ్చారు. కాటేదాన్, అత్తాపూర్, శివరాంపల్లి, బహదూర్పురా ప్రాంతాలకు చెందిన వృద్దులకు ఆయా ప్రాంతాలలోని పోస్టాఫీసుల్లోనే అందిస్తామన్నారు. మేయర్ మహేందర్‌గౌడ్ హామీపట్ల వృద్దులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రతీ నెల పది కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి పింఛన్లు తీసుకెళ్లడంతో తాము తీవ్ర ఇబ్బం దులు పడుతున్నామని, మాకు స్థానికంగానే అందిస్తే మేలు చేసినవారవుతారని వృద్దులు పేర్కొన్నారు.

## గుర్తు తెలియని యాచకుడు మృతి



పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: గుర్తుతెలియని యాచకుడు మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. వివరల్లోకి వెళితే.. గత కొంత కాలంగా కొంపల్లిలోని బొల్లారం రోడ్డు సమీపంలో 45-50సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి యాచకుడిగా ఉంటూ అక్కడే పడుకుంటున్నాడు. శుక్రవారం సాయంత్రం బొల్లారం రోడ్డు సమీపంలో ఎవరో గుర్తుతెలియని వ్యక్తి విగతజీవిగా పడి ఉన్నాడని పేట్‌బషీరాబాద్ పోలీసులకు స్థానికులు సమాచారం అందిచారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## గృహిణి అదృశ్యం



పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: ఇంటి నుంచి బయటకు వెళ్ళిన గృహిణి అదృశ్యమైన సంఘటన శనివారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లాకు చెందిన మేకల రాజిరెడ్డి, సుహాసినిని పదేళ్ళ క్రితం వివాహ చేసుకొని ఇద్దరు పిల్లలతో నగరానికి వసల వచ్చి సుచిత్రా బ్యాంక్‌కాలనీలో ఉంటున్నారు. రాజిరెడ్డి దుండిగల్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, భార్య సుహాసిని గృహిణిగా ఇంట్లోనే ఉంటుంది. ఈ క్రమంలో గత సంవత్సర కాలంగా ఇరువురికి తరచు గొడవలు జరుగుతుండడంతో భార్య సుహాసిని పుట్టింటికి వెళ్ళిపోయింది. రాజిరెడ్డి అత్తగారింటి వెళ్ళి భార్యకు నచ్చజెప్పి పెద్దల అంగీకారంతో ఇంటికి తీసుకువచ్చినా భర్తతో 3నెలలుగా మాట్లాడటం మానేసింది. అయితే ఓ రోజు భర్త రాజిరెడ్డికి ఫోన్ చేసి బాబును స్కూల్ నుంచి ఇంటికి తీసుకురావాలని తెలిపి ఫోన్ కట్‌చేసింది. రాజిరెడ్డి ఇంటికి వచ్చి చూసేసరికి కూతురు ఒంటరిగా ఉండడం గమనించి ఆమెను అడుగగా అమ్మ ఇంటి నుంచి వెళ్ళిపోయిందని తెలిపింది. రాజిరెడ్డి చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్ళలో విచారించినా ఆచూకీ లభించకపోవడంతో పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## పాదయాత్రలతో సమస్యలు పరిష్కారం: ఎమ్మెల్యే మాధవరం



పద్మావతి నగర్‌లో సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికపుడు పాదయాత్రలు నిర్వహించి సమస్యలు సృష్టించి వాటి పరిష్కారానికి తగిన విధంగా కృషిచేయడం జరుగుతుందని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. శనివారం డివిజన్ పరిదిలోని బస్తీల కాలనీలలో రూ.3కోట్ల 50లక్షల వ్యయంతో సిసిరోడ్డు నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిదిలోని బస్తీల కాలనీలలో దాదాపుగా అన్ని అభివృద్ధి పనులు పూర్తిచేయడం జరిగిందని పెండింగ్‌లో ఉన్న పనులను కూడా తొందర లోనే పూర్తి చేస్తామన్నారు. అభివృద్ధి కోసం అడిగిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ , మం త్రి కేటీఆర్ నిదులు కేటాయించడం జరిగిందని వాటితో మరిన్ని అభివృద్ధి కార్యక్ర మాలు పూర్తిచేయనున్నామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గం మైనార్టీసెల్ అధ్యక్షు లు ఎమ్‌డి గౌసుద్దీన్, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు లింగాల ఆయిలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి అహ్మద్, సలీమ్, సయ్యద్‌రియాజ్, జావేదుద్దీన్, పార్వతమ్మ, జ్ఞానేశ్వర్, యోగిరాజు స్వామి పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 8,9 తేదీల్లో ఛలో ఢిల్లీ

### బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి. ఆర్.కృష్ణయ్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ, గుజ్జసత్యం తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం బిసిల బడ్జెట్ 2లక్షల కోట్లు కేటాయించాలని బిసిలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8,9 తేదీల్లో ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించి పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన జరపాలని నిర్ణయించినట్లు బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి. ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈమేరకు శనివారం విద్యానగర్‌లోని బిసిభవన్ లో జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, ఉపాధ్యక్షులు గుజ్జసత్యం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య హాజరై ఛలోఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో బిసిలకు అన్ని రాజకీయ పార్టీలు 50శాతం టికెట్లు ఇవ్వాలని కోరారు. బిసిలకు అన్యాయం చేసే పార్టీ భరతం పడతామని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు బిసిలను ఓటుబ్యాంకుగా వాడుకుంటూ రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా 75సంవత్సరాలుగా అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. జెండాలు మోయడానికి, జిందాబాద్‌లు కొట్టడానికే బిసిలను వాడుకుంటున్నారని ఇలా చేస్తే ఊరుకునేది లేదన్నారు. వెంటనే కేంద్రప్రభుత్వం స్పందించి బిసిబిల్లు పార్లమెంట్‌లో పెట్టాలని,అలాగే జనగణనలో కులగణన చేసి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, పాండరీ నాథ్, రాజ్‌కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో బిఎస్‌పి విస్తరణకు ప్రత్యేక చర్యలు

### పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా డాక్టర్ వెంకటేశ్ చౌహాన్ నియామకం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్ చౌహాన్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ నుంచి చౌహాన్ నియామకపత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకటేశ్ చౌహాన్ మాట్లాడుతూ రాబోయే కాలంలో బిఎస్‌పిని తెలంగాణ రాష్ట్రంలో విస్తరించడంతో పాటు పేదల గురించి ప్రశ్నించే గొంతుగా ఉంటామన్నారు. బహుజనులపై జరుగుతున్న అన్యాయాలపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిగ్రామంలో చైతన్యం తీసుకువచ్చి రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బిఎస్‌పి జెండాను ఎగురవేస్తామని అన్నారు. మహనీయుల స్ఫూర్తితో పోరాడుతామని, అతి చిన్న వయసులో నాకు ఇచ్చిన ఈ బాధ్యతను గిరిజన సమాజాన్ని చైతన్యపరుస్తానని తెలిపారు. రాష్ట్రకోఆర్డినేటర్ లాంటి ఎంతో గొప్ప అవకాశాన్ని ఇచ్చిన తెలంగాణ ఇంచార్జ్ రాంజీ గౌతమ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలు ఎప్పుడు చేపట్టబోము

### మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సంజీవరెడ్డి నగర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలు తాము ఎప్పుడు చేపట్టబోమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం సనత్‌నగర్ డివిజన్‌లోని జెక్ కాలనీలో గోకుల్ థియేటర్ ఎదురు రోడ్డులో చేపట్టిన ఆర్చి నిర్మాణ పనులను మంత్రి తలసాని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఫుట్‌పాత్‌ను తొలగించి నూతనంగా నిర్మిస్తున్న ఆర్చి నుండి హనుమాన్ దేవాలయం వరకు విడిసిసి రోడ్డును నిర్మించడం జరగుతుందన్నారు. సనత్‌నగర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత ఈ ప్రాంతం ఎవరూ ఊహించని విధంగా ఎంతో అభివృద్ధి చెందిందని, అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించినట్లు వివరంచారు. జెక్ కాలనీ వాసులకు తాను ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ వస్తున్నానని చెప్పారు. సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు విస్తరణ, స్ట్రీట్ నెంబర్ 1లో రోడ్డు నిర్మాణం, పార్క్ అభివృద్ధి వంటి పలు పనులు పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంకా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ కొలన్ లక్ష్మీబాల్‌రెడ్డి, జోనల్ కమీషనర్ రవికిరణ్, జెక్‌కాలనీ అధ్యక్షులు సూర్యశంకర్‌రెడ్డి, రాఘవయ్య, సురేష్‌గౌడ్, ఈఈ ఇందిర, టౌన్‌ప్లానింగ్ ఏసిపి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించాలి : సిపిఎం



డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల కోసం మారేడ్‌పల్లి ఇన్‌ఛార్జి తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అడ్డగుట్ట ప్రజా సంఘాల నేతలు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: గ్రేటర్‌లోని వివిధ మురికివాడల్లో సంవత్సరాల తరబడి అద్దె ఇండ్లల్లో నివాసం ఉంటున్న నిరుపేదలకు ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సికింద్రాబాద్ జోన్ ప్రజా సంఘం కన్వీనర్ ఎం.అజయ్‌బాబు, సిఐటియు హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఏ.కుమార స్వామిలు డిమాండ్ చేశారు. మహేంద్ర హిల్స్‌లో ప్రభుత్వ ఖాళీ భూములను పరిరక్షించాలని, ప్రస్తుతం ఖాళీగా ఉన్న 4 ఎకరాల ప్రభుత్వ భూమిలో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి అర్హులైన లబ్దిదారులకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శనివారం అడ్డగుట్ట జిఎం అంజయ్య విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, ఐద్వాప్రతినిధులు ఆర్.వీరలక్ష్మి, టి.మహేందర్, ఎం.గోపాల్, ఆర్.మల్లేశ్, నర్సింహ్మా, బాలయ్య, శారధ, ప్రవీణ్, లలిత, అలేఖ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనగా ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ వేడుకలు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కార్ఖానలోని రెనోవా సౌమ్య క్యాన్సర్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకొని ప్రాణాలతో విజయం సాధించిన పలువురిని విజ క్యాన్సర్ అసుపత్రి వైద్య నిపుణులు సన్మానించారు. అర్.మల్లికా (రొమ్ము క్యాన్సర్), చిన్న మల్లయ్య బ్లెడ్‌క్యాన్సర్, షెట్టీ, ఏ.గిరిజా, సంధ్య, హిమబింధులు క్యాన్సర్ వ్యాధి నుంచి బయటపడినందుకు అసుపత్రి డైరెక్టర్, ఆసుపత్రి ఛీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పాలంకి సత్య దత్తాత్రేయ వారికి శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి హెచ్‌ఓడి డాక్టర్ యుగంధర్ శర్మ, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లలితా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అడ్డగుట్టలో..** అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తుకారాంగేట్ బోయ బస్తీలో సాహిత పౌండేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛీఫ్ కో-ఆర్టినేటర్‌లు ఎన్.వెంకటేష్, దేవ దీపిక, శ్రీనివాస్‌రావ్, నిత్యానంద్, వజీర్, డాక్టర్ దేవరాజ్‌లు పాల్గొని రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

# ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లకు సహకరించండి

### ప్రతిపక్ష పార్టీలకు మాల మహానాడు వినతి



రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న హసేన్, కాంతయ్య

హైదరాబాద్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లు కల్పించి ఎస్సీ,ఎస్టీవర్గాల వారికి ఉద్యోగ ఉపాధి కల్పించుటకు ప్రభుత్వం కృషి చేయాలని దీనికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపి తాము చేస్తున్న న్యాయబద్ధమైన ఉద్యమానికి సహకరించాలని కోరుతూ తెలంగాణ మాలమహానాడు అధ్యక్షులు తల్లమల్ల హసేన్ నేతృత్వంలో రాష్ట్ర మాల మహానాడు కమిటీ నాయకులు శనివారం రాష్ట్ర రాజధానిలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీల అధ్యక్షులు, నాయకులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా పిసిసి ఛీఫ్ రేవంత్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీలో శ్రీనివాస్‌రెడ్డి, టిజెఎస్ అధ్యక్షులు కోదండరాం, సిసిఎం, సిపిఐ,బిజెపి నేతలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా హసేన్ మాట్లాడుతూ భారతీయ సమాజంలో కులం ఆదారిత అసమానతలు ఉన్నాయని ఈఅసమానతలను సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విస్తారంగా వ్యాప్తి చెందడం వల్ల అనేక ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ శాఖలు నిర్వీర్యమై లక్షలాదిమంది ఉద్యోగులు ప్రైవేట్‌రంగంలో పనిచేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం నుంచి భూమి విద్యుత్,బ్యాంకు రుణాల సబ్సిడీ రూపేన అనేక లబ్ది పొందుతున్న ప్రైవేట్‌రంగ యాజమాన్యాలు ఎస్సీ,ఎస్టీలను బలహీనవర్గాల వారికి విస్మరిస్తుందని వీరందరికీ ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్ విధానాన్ని కొనసాగిస్తూ వారికి ఉపాధి మార్గాన్ని కల్పించాల న్నారు. ఈకార్యక్రమంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ముండ్లగిరి కాంతయ్య, గిండ్ల పరంజ్యోతి రావు, జాతీయ ప్రధాన కార్యదర్శులు మేకతోటి కాంతయ్య, మంచాల వెంకటస్వామి, బేగరి శివరాజ్ పాల్గొన్నారు.

# ఘనంగా పెద్దమ్మ తల్లి కలాణం.. బోనాల ఊరేగింపు

## పాల్గొన్న భక్తులు.. రాష్ట్ర నాయకులు

శామీర్‌పేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : తుర్కపల్లి గ్రామంలో శనివారం శ్రీపెద్దమ్మ తల్లి అమ్మవారి కళ్యాణోత్సవ కార్యక్రమం, బోనాల పండుగ ఘనంగ జరిగింది. శనివారం శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి గ్రామంలో శ్రీపెద్దమ్మ తల్లి ఆలయ చైర్మన్ దాసరి ముత్యాలు (ముదిరాజ్ సంఘం) ఆధ్వర్యంలో శ్రీపెద్దమ్మ తల్లి కల్యాణం, బోనాల పండుగను భక్తులు, గ్రామ ప్రజలు ఘనంగ జరుపుకున్నారు. తుర్కపల్లి గ్రామంలో శ్రీపెద్దమ్మ తల్లి ఆలయం ప్రధమ వార్షికోత్సవం సందర్భంగ మూడు రోజుల పాటు శ్రీపెద్దమ్మ తల్లి పండుగ ఉత్సవాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 3నుంచి 5వ తేదీ వరకు శ్రీపెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు అన్నదాతగ దాసరి స్వరూపముత్యాలు, దాసరి విఖిత రవిల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంను నిర్వహిస్తున్నారు. దీనిలో గ్రామ సర్పంచు జి.కవితవేణుగోపాల్‌రెడ్డి, స్థానిక ఎంపిటిసి,వైస్‌ఎంపిపి సుజాత, మాజీ సర్పంచు జ్యోతిసత్యనారాయణ, ఉపసర్పంచు,పలువురు వార్డుసభ్యులు, గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. అయితే శ్రీపెద్దమ్మతల్లి ఆలయ ప్రధమ వార్షికోత్సవం పండుగ సందర్భంగ శనివారం టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి ఎస్.హరివర్ధన్‌రెడ్డి విచ్చేసి శ్రీపెద్దమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగ ఆయనను ఆలయ చైర్మన్ దాసరి ముత్యాలు సన్మానించారు. ఆయనతో పాటు మండల కాంగ్రెస్ అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, మండల నాయకులు తుంకి బిక్షపతి, గ్రామ నాయకులు జి.వేణుగోపాల్‌రెడ్డి, బి.సత్యనారాయణ, యు.వెంకటేశ, జి.రాజు, ఆర్.యాదగిరి, కె.నర్సింగ్‌రావు, ఫణి రాజు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. ఆ తరువాత శ్రీపెద్దమ్మతల్లి అమ్మవారిని బిజెపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కొంపల్లి మోహన్‌రెడ్డి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ దాసరి ముత్యాలు ఆయనను సన్మానించారు. ఆయనతో పాటు బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు బుద్ది శ్రీనివాస్, శామీర్‌పేట మండల బిజెపి ప్రధాన కార్యదర్శి కె.నర్సింగ్‌రావుముదిరాజ్, నాయకులు ఎం.అశోక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నా: ఎమ్మెల్యే ఈటల

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లో శనివారం రాత్రి కట్టమైసమ్మ అమ్మవారిని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ దర్శించుకున్నారు. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు ఈటలను ఆహ్వానించగా ఆయన విచ్చేసి నూతన దేవాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆలయంలో ఈటల కట్టమైసమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలకు సేవ చేసే అవకాశం వచ్చిందని ఎల్లప్పుడూ ప్రజాసేవలోనే ఉంటామని అందరూ సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. తాళ్లకుంట చెరువు కట్టపై పురాతనమైన కట్టమైసమ్మతల్లి గుడిని జీర్ణోద్ధరణ చేసి కొత్త ఆలయం నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఈసందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఈటలకు ప్రజాప్రతినిధులు, నాయకులు స్వాగతం పలికి ఆలయం ఆవరణలో సన్మానించారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ నిరుడి గీతా శ్రీనివాస్, ఎంపిటిసి నిరుడి రామారావు, మండల బిజెపి అధ్యక్షులు చలువాది ప్రవీణ్‌రావు, ఉపసర్పంచులు కట్ట సత్యనారాయణగౌడ్, మాయ నరేశ్, మత్యకారుల సహకార సంఘం అధ్యక్షులు నిరుడి లింగం, మాజీ ఉపసర్పంచ్ కొమ్మిడి దామోదర్‌రెడ్డి, వార్డుసభ్యులు, నాయకులు వినోద్, హరిబాబు, కుమార్, శ్రీకాంత్, నవీన్, విజయ్, శ్రీరాములు, సురేశ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# నరేంద్రమోడి చిత్ర పటానికి పాలాభిషేకం



భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఓబిసి సెల్ ప్రతినిధులు

బేగంబజార్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: తెలంగాణ బిజెపి విశ్వకర్మ ఓబిసి సెల్ ఆద్వర్యంలో దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి చిత్ర పటానికి పాలాబిషేకం చేశారు.శనివారం బిజెపి ఓబిసి సెల్ కన్వీనర్ పూసల బ్రహ్మణ చార్య నేతృత్వంలో పార్టీ కార్యాలయం ఆవరణలో దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈకార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మనోహార్‌రెడ్డి,డాక్టర్ సురేందర్, భజరంగ్‌సేనా సోషల్ మీడియా ఉపాద్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్ రావుగుప్త, నాగభూషణం,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కాసాని జ్ఞానేశ్వర్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ



జ్ఞానేశ్వర్ తల్లి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మందకృష్ణ మాదిగ

నిజాంపేట్, ఫిబ్రవరి4 ప్రభాతవార్త: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ శనివారం తెలంగాణ టీడీపి రాష్ట్ర అధ్యక్షుడు కా సాని జ్ఞానేశ్వర్‌ను తల్లి కౌసల్య చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం కాసాని జ్ఞానేశ్వర్‌ను ఓదార్చి ధైర్యం చెప్పి తన సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ జ్ఞానేశ్వర్ నివాసానికి చేరుకొని అతని తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజాసింగ్ అనుచరులు, టీడీపి శ్రేణులు పాల్గొన్నారు.

# అరెస్టు చేసిన పిడిఎస్‌యు విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలి

సైఫాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: ప్రభుత్వాలే నియమించిన కమిషన్‌లు, కమిటీలు చేసిన సిఫార్సుల మేరకు విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని, నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలని కోరుతూ చలో అసెంబ్లీ చేపట్టిన పిడిఎస్‌యు విద్యార్థులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేయడాన్ని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటి తీవ్రంగా ఖండించింది. విద్యారంగం బలోపేతానికి చేస్తున్న డిమాండ్లను అంగీకరించి బిజెపి విధానాలకు వ్యతిరేకంగా తమ నిజాయితిని నిరుపించోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను వెంటాడి, వెంటాడి అరెస్టు చేయడం అత్యంత అమానుషం, దుర్మార్గమని పరిరక్షణ కమిటి రాష్ట్ర అధ్యక్ష, ధ్రాన కార్యదర్శులు ప్రొఫెసర్ చక్రధర్‌రావు, హరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ విమర్శించారు. అక్రమంగా అరెస్టు చేసిన విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

# క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం

హైదరాబాద్, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని క్యాన్సర్‌తో చికిత్స పొదుతున్న రోగుల సహాయార్థం ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈమేరకు శనివారం అమీర్‌పేట్ ఆస్టర్‌ప్రైమ్ లో ఏర్పాటు చేసిన ఈరక్తదాన శిబిరంలో సిబ్బంది 50మందికి పైగా పాల్గొని రక్తదానం చేశారు. ఇలా సేకరించిన రక్తాన్ని క్యాన్సర్‌రోగుల తోపాటు హాస్పిటల్‌లో ఆవసరమైన వారికి అందజేయనున్నారు. ఈసందర్భంగా పాథాలజీ విభాగాధిపతి డా.రమాదేవి మాట్లాడుతూ చికిత్స పొందడానికి వచ్చే పలువురు రోగులకు పలు సందర్భాల్లో రక్తం అవసరం అవుతుందని ఒక్కోసారి అదిదొరకక తీవ్ర ఇబ్బది ఎదురవుతుందన్నారు. ఇలా ప్రత్యేక కార్యక్రమాల ద్వారా చేకరించి రోగులకు అందజేయనున్నట్లు తెలిపారు. కాగా ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈరక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈకార్యక్ర మంలో బ్లడ్‌బ్యాంక్ ఆఫీసర్ కె.అనిల్‌రాజ్, డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# చార్మినార్ నియోజకవర్గం బీఎస్పీ అధ్యక్షులుగా రాంచరణ్ దాస్



పాతబస్తీకి చెందిన రామ్‌చరణ్ దాస్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

చార్మినార్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : పాతబస్తీకి చెందిన మూల రాంచరణ్ దాస్ చార్మినార్ నియోజకవర్గం బహుజన సమాజ్ పార్టీ (బీస్పీ) అధ్యక్షుడుగా నియమితులయ్యారు. ఈ మేరకు బీస్పీ నగర అధ్యక్షుడు చాట్ల చిరంజీవి సమక్షంలో పార్టీ అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కండువా కప్పి రామ్‌చరణ్ దాస్‌ను పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా చార్మినార్ నియోజకవర్గం బహుజన సమాజ్ (బీస్పీ) పార్టీ నూతన అధ్యక్షులు రాంచరణ్ దాస్ మాట్లాడుతూ పాతబస్తీలో పార్టీ పటిష్టత కోసం నా శాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు. రాంచరణ్ దాస్ ప్రస్తుతం వీకర్ సెక్షన్స్ అండ్ మైనార్టీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ నగర అధ్యక్షుడిగా,అంబేద్కర్ సంఘం నగర అధ్యక్షులుగా పని చేస్తున్నారు. పాతబస్తీలో ఆయన గత రెండు దశాబ్దాలుగా బడుగు, బలహీనవర్గాల ప్రజల సంక్షేమంకోసం కృషి చేస్తున్నారు.

# ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి విజిలెన్స్ మానిటరి కమిటి సభ్యుడిని కలిసిన దళిత నాయకులు



బేగంబజార్, ఫిబ్రవరి 4ప్రభాతవార్త: గత కొద్ది రోజుల క్రితం అస్వస్థతకు గురై ఆసుపత్రిలో వైద్య సేవలు పొంది కొలుకున్న హైదరాబాద్ జిల్లా ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటి విజిలెన్స్ మానిటరీ కమిటి సభ్యులు బత్తుల రామ్‌ప్రసాద్‌ను దళిత నాయకులు, బోయిని ఎల్లేష్‌మాదిగ, సుమన్‌కుమార్,గణేష్,నరేందర్‌లు కలిసి ఆరోగ్య విషయాన్ని అడిగి తెలుసుకున్నారు.

# బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

### అధ్యక్షునిగా బైరు రవికృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షునిగా కుల్కచర్ల శ్రీనివాస్



నూతన కమిటీ నాయకులను సత్కరిస్తున్న జాజుల శ్రీనివాసగౌడ్

ధర్నాచౌక్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షునిగా బైరు రవికృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షునిగా కుల్కచర్ల శ్రీనివాస్ ఎన్నికయినట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజులు శ్రీనివాసగౌడ్ ప్రకటించారు. శనివారం దోమలగూడలోని బీసీ సంక్షేమసంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వివిధ బీసీ సంఘాల నేతలు పాల్గొని నూతన కమిటీ అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జాజుల శ్రీనివాష్ గౌడ్ మాట్లాడుతూ వరంగల్ జిల్లాకు చెందిన బైరు రవికృష్ణ బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షునిగా ఉండి బీసీ సంక్షేమానికి ఎంతగానో కృషి చేశారని, ఆయన సేవలను గుర్తించి, అధ్యక్షునిగా ఎన్నుకోవటం జరిగిందని తెలిపారు. అదే విధంగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కుల్కచర్ల శ్రీనివాస్ బీసీ విద్యార్ధి సంఘం అధ్యక్షునిగా విద్యార్థుల సమస్యలపై గత 18 ఏళ్లుగా ముందుండి పోరాడుతున్నారని, ఆయన సేవలను గుర్తించి, ఆయనను బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షునిగా ఎన్నుకోవటం జరిగిందని వివరించారు. నూతనంగా ఎన్నికయిన అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్షులు బైరు రవికృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు రాజకీయ అధికారమే లక్ష్యంగా పోరాడుతామని, తమపై నమ్మకంతో తమకు ఇచ్చిన నూతన బాద్యతలను శక్తివంచన లేకుండా నెరవేరుస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికయిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం అధ్యక్షులు కనకాల శ్యాం, ప్రధాన కార్యదర్శి బాలు ముదిరాజ్, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ గణేష్‌చారి, బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు తాటికొండ విక్రంగౌడ్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌గౌడ్, బీసీ సంఘాల నాయకులు జూకంటి ప్రవీణ్ కుమార్, సింగం నగేష్, నవీన్‌కుమార్, మధు, మహేష్‌యాదవ్, మాదేశి రాజేందర్, పానుగంటి విజయ్, ఇంద్రం రజక పాల్గొన్నారు.

# మగ్ధూం మొయినోద్దీన్ అలుపెరగని పోరాట యోధుడు

సైఫాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: ప్రముఖ కమ్యూనిస్టు పార్టీ నేత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మగ్ధూం మొయినోద్దీన్ పేద ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేశారని లోక్‌దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి పి.వెంకటరాజేశ్వర్‌రావు చెప్పారు. ఆయన సేవలు మరువలేనివని ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని, పేద, బడుగుబలహీనవర్గాలు, కార్మికవర్గం కోసం రాజీలేని పోరాటాలు గుర్తు చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన మగ్ధూం మొయినోద్దీన్ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల కోసం రాజకీయ నాయకులు మగ్ధూంను అదర్శంగా తీసుకుని ఉద్యమించాలని, ఆయన అశయాలను నేరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు ఆయన మగ్ధూం చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజు, సతీష్, జయమ్మ, అంజీ తదితరులు పాల్గొన్నారు.

# పోగాకు ఉత్పత్తులతోనే క్యాన్సర్ మరణాలు

సైఫాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: క్యాన్సర్ మరణాల్లో 30 శాతానికి పైగా పోగాకు సంబంధిత ఉత్పత్తుల వాడకం కారణంగానే జరుగుతున్నాయని పలువురు వైద్యుల వెల్లడించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఇస్కాన్ సంస్థ అధ్యక్షుడు మహాశృంగదాస ఆధ్వర్యంలో శనివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంకాలజిస్టులు, పలువురు వైద్య నిపుణులు మాట్లాడారు. క్యాన్సర్ బారీ నుంచి యువతరాన్ని కాపాడుకోవాల్సిన అవసర ఉందని, క్రమం తప్పని పరీక్షలతో ప్రాథమిక దశలోనే ఈ వ్యాధిని అరికట్టే అవకాశం ఉందన్నారు. మహిళల్లో ఎక్కువగా వచ్చే సర్వేకల్, బ్రెస్ట్ క్యాన్సర్, పురుషుల్లో లంగ్ క్యాన్సర్ ప్రదానమని, 3,4వ దశలోనే 70 శాతానికిపైగా మరణాలు సంభవిస్తాయని చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్లు విఫిల్‌గోయల్, నివేద రావు, సాయినాథ్, సునీత తదితరులు పాల్గొన్నారు. కాగా నేడు నిర్వహించదలపెట్టిన 5కె రన్‌కు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం వల్ల వాయిదా వేయడం జరిగిందన్నారు.

# అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు మగ్ధూం

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టీ.నరసింహా



మగ్ధూం విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ధర్నాచౌక్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త: పీడిత ప్రజల విముక్తి కోసం అలుపెరుగని పోరా టం చేసిన మహనీయుడు మగ్ధూం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టీ.నరసింహా అన్నారు. శనివారం మగ్ధూం జయంతి సంద ర్భంగా ట్యాంక్‌బండ్‌పై నున్న మగ్ధూం విగ్రహానికి సీపీఐ హైదరాబాదన జిల్లా సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింహా మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రముఖకవి, రచయిత, కార్మిక ఉద్యమ నాయకుడు కామ్రెడ్ మగ్ధూం ఆశయాలను, పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్లా లని పిలుపునిచ్చారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ మగ్ధూం జీవితం నేటి తరానికి ఎంతో ఆదర్శమని కొనియాడారు. మగ్ధూం పోరాటాన్ని, త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో విద్వేషాలు రెచ్చగొడుతున్న మతోన్మాదానికి, అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించటమే అసలైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా నాయకులు స్టాలిన్, చంద్రమోహన్‌గౌడ్, నెర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, కిషన్, ధర్మేంద్ర, ఉమర్ఖాన్, లతీఫ్, సుమంత్, కళ్యాణ్ పాల్గొన్నారు.

# ప్రకాశం నగర్‌లో శ్రమదానం



బేగంపేట ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : బేగంపేట ప్రకాశనగర్ లో శనివారం మార్పు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలెంటీర్లు శ్రమదానం చేసారు. ప్రకాశం నగర్ పరిసర ప్రాంతాలతో పాటు రైలు పట్టాల వెంట ఉన్న చెత్త కుప్పలను సైతం వారు తొలగించారు. ఫౌండేషన్ కు చెందిన సుమారు 40మంది వాలెంటీర్లు స్వచ్ఛందంగా బ్యాగులు,పలుగు,పార చేత బట్టుకుని ఎంతో కాలంగా పేరుకు పోయిన చెత్తను,వ్యర్థాలను తొలగించారు.వ్యర్థాలు,పాలిథిన్ కవర్లు, రాళ్లు, మట్టి సుమారు 700కిలోల మేర చెత్తను తొలగించడంతో పాటు ఆ ప్రాంతాన్ని ఊడ్చి పరిసరాలను శుభ్రంగా చేసారు. పర్యా వరణ పరిరక్షణ, పరిస రాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మార్పు ఫౌండేషన్ ఫౌండేషన్ ప్రతినిధులు వెల్లడించారు.

# బిఆర్ఎస్ మహిళా నేత మృతి



మృతి చెందిన మణికొండ మున్సిపల్ బిఆర్ఎస్ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పద్మజ శర్మ

నార్సింగి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : మణికొండ మున్సిపల్ బిఆర్ఎస్ మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పద్మజ శర్మ అకాల మృతి చెం దారు. ఈ విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నాయకులు దీవ్ర దిగ్బ్రాంతిని వ్యక్తం చేశారు. పార్టీ ఆదేశించిన కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు తనవంతు ఉత్సాహంగా పాల్గొనేదని, గృహిణులను సైతం కార్యక్రమాలకు తీసుకవచ్చేదని నాయకులు గుర్తు చేసుకున్నారు. అందరితో కలివిడిగా ఉంటూ, తనకు అప్పగించిన పనులను సమర్థవంతంగా పూర్తి చేసే నాయకురాలు పద్మజ అని అందరూ కొనియాడారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని సోషల్ మీడియాలో వందలాది మంది పోస్టులు పెట్టారు. మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు, కౌన్సిలర్ కావ్యశ్రీ, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, సీనియర్ నేతలు సాయిరెడ్డి, నరేష్ తదితరులు పద్మజ కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు.

# మంత్రి మల్లారెడ్డిని కలిసిన జిల్లా టిఎన్‌జిఓస్ నాయకులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త : కార్మికశాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డిని మేడ్చల్ జిల్లా టిఎన్‌జిఓస్ నాయకులు పలువురు శనివారం ఉదయం కలిశారు. ఈ నెల 10వ తేదీన తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ డైరీ, క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్ర మానికి ఆహ్వానించటానికి మంత్రిని జిల్లా టిఎన్‌జిఓస్ నాయకులుగ వెళ్లి కలిసినట్లు ఎ బి.రవిప్రకాశ్ పేర్కొన్నారు.


**వార్త VAARTHA CLASSIFIEDS**

**SITUATION VACANT**

★ Wanted Faculty for Matrusri E&L School (SSC Board) at Nallakunta. Subjects: English and Social Studies (Good English Language Skills) for High School. Marketing and Academic Counselor with experience and Communication Skills. Very good salaries as per Market Standards. Negotiable **Contact: 7331129454, 9949052606.**

**(Ro.No. 52087)**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


**తెలంగాణ ప్రభుత్వం**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**
**టెండర ప్రకటన**

నిట్ నెం. కొటేషన్ ప్రకటన సం.01/EE (Elec)/KZ/GHMC/2022-23, తేది: 03.02.2023. పని పేరు: సీల్డు కొటేషన్‌ల కొరకు: GHMC కాంప్లెక్స్ ఆబిడ్స్ పార్కింగ్ లాట్ వద్ద CT మీటరింగ్ ప్యానెల్ బోర్డుల ఏర్పాటు. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ, సమయం: ప్రారంభ తేది: 04.02.2023 ఉ.10.30 గం. చివరి తేది: 07.02.2023 సా.05.00 గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: EE (విద్యుత్) KZ, GHMC, సెల్ నం.9154909283. గమనిక: కొటేషన్‌ల దాఖలకు సవివర నిర్దేశితాలు మరియు నిబంధనలు వెబ్‌సైట్: www.ghmc.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. తదుపరి సమాచారానికి Dy.E.E (ఎలక్ట్రికల్)/సర్కిల్-14, 9154768827ను సంప్రదించవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (విద్యుత్), ఖైరతాబాద్ జోన్, GHMC

**DIPR.No.12210-PP/CL/Advt/1/2022-23, తేది: 04.02.2023**

**తెలంగాణ ప్రభుత్వం**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**

నిట్ నెం. 53/Div.13(పాత-7B)/GHMC/2022-23, పని పేరు: సివిల్ పనులు (40 నం.లు). అంచనా మొత్తం: రూ.424.55 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: 06.02.2023 సా.4.30 గం. నుండి 13.02.2023 సా.4.30 గం. వరకు. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నం.13, (పాత-7B)(KZ), GHMC ఖైరతాబాద్, హైదరాబాద్ 9154960552. తదుపరి వివరాలు www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, డివిజన్ సం.13, (పాత-7B), GHMC

**DIPR.No.12204-PP/CL/Advt/1/2022-23, తేది: 04.02.2023**

**IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-V ADDL. METROPOLITAN MAGISTRATE, MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT: L.B. NAGAR**
**O.S.No. 1959 of 2022**

Between
**Kotha Nikhitha Reddy ...Plaintiffs**
And
**Kotha Venkat Narasimha Reddy & others ...Defendants**
To
All concerned
Take notice that the plaintiffs herein has filed the above suit for declaration, declaring the plaintiffs are the absolute owners and possessors of the suit schedule property being the legal heir of deceased Late Kotha Divya aliyas Neelaveni Reddy W/o. **Kotha Venkat Narasimha Reddy.** The above suit is posted to **07-02-2023** for appearance. If anybody having any objections, claims or interest are hereby directed to appear before this Hon'ble Court on **07-02-2023** at 10.30 a.m. by personally or through an advocate, failing which the matter will be decided on merits.

**SCHEDULE OF PROPERTY**

All that piece and parcel of the open land bearing Plot No.8(Part), admeasuring 164 Sq.yards or its equivalent to 137.10 Sq.Mtrs, in Sy.Nos. 98(Part) and 99, Krishna Nagar Colony, Situated at Peerzadiguda Village, **Medipally Revenue Mandal, Medchal-Malkajgiri District**, under Peerzadiguda Muncipal Corporation, under registration Sub District Keesara and bounded by: North: Plot No.9/Part (Northern Part), South: Survey No.97, East: Plot No.100 & 101, West: 25' Wide Road.

// BY ORDER OF THE COURT //

**ASHOK REDDY**
**Advocate**
**Counsel for Plaintiffs**

## పార్కు స్థలాలను కాపాడాలి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** పార్కు స్థలాలు కబ్జా కాకుండా అధికారులు పటిష్టమైనచర్యలు తీసుకోవాలని ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజక వర్గ పరిధిలోని పలు పార్కుస్థలాలు కబ్జాకు గురవుతుండడం తో ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో శనివారం స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు దుర్గప్రసాద్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ బిఎన్‌రెడ్డినగర్, చంపాపేట, హస్తినపురం, చైతన్యపురి, హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్లలోని టీచర్స్ కాలనీ, హైవే కాలనీ, జక్కిడి రాంరెడ్డి కాలనీ, ఎన్వీకాలనీ, భవాని నగర్, సంతోషి మాత దేవాలయం సమీపంలోని పార్క్ స్థలాలలో కబ్జాదా రులు ప్రైవేటు స్థలం అని బోర్డులు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. రెండు దశాబ్దాలుగా కోర్టులో వివాదంలో ఉన్న పార్క్‌స్థలాలు కాపాడాలని కౌన్సిల్ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్‌కమిషనర్ పంకజ, సిటీప్లానర్ ప్రసాద్ రావు, ఉపకమిషనర్లు హరికృష్ణయ్య, కమిషనర్లు సురేందర్ రెడ్డి, మారుతిదివాకర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే మంచిరెడ్డి



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి

**తుర్కయంజాల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడకు చెందిన స్థానికులు అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆర్థిక సాయం కోసం కౌన్సిలర్ సిద్దల జ్యోతి జంగయ్య, రైతు బంధు మం డల కోఆర్డినేటర్ కందాల బలదేవరెడ్డిని సంప్రదించడంతో వారు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని సంప్రదించారు. వెం టనే స్పందించి ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి యాదిరెడ్డికి రూ. 60 వేలు, పద్మకు రూ. 24 వేలు, పోచి గారి పూజాకు రూ. 16 వేల చెక్కులను నాయకులతో కలిసి అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గంగని శ్రీనివాస్ కురుమ, పశువుల దేవేందర్, పల్లపు యాదగిరి, శీలం ప్రవీణ్ కుమార్, అక్కి వంశీ బుద్దా కళ్యాణ్, శీలం మానేయ, బిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## మెగా జాబ్‌మేళా వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుజాత నాయక్, మధుసూధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 11వ తేదీన ఏర్పాటు చేస్తున్న మెగా జాబ్ మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను హస్తినాపురం డివిజన్ ఇం ద్రప్రస్త కమ్యూనిటిహాల్‌లో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అందోజు సత్యంచారి అధ్యక్షతన జరిగిన కార్యక్ర మంలో కార్పొరేటర్ సుజాత నాయక్, బిఆర్ఎస్ నాయకులు గజ్జెల మధుసూధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుజాత నాయక్ మాట్లాడుతూ మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులంద రు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గజ్జెల మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ మెగా జాబ్‌మేళా గురించి గడపగడపకు చేరేలా ప్రచారం చేయాలన్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్, ఐటి, నాన్ ఐటిలకు చెందిన 120కు పైగా కంపెనీల ప్రతిని ధులు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటారని, దాదాపు 10 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలు పొందే వీలుందని ఆయన పేర్కొ న్నారు. కార్యక్రమంలో కంచర్ల శివారెడ్డి, దేరంగుల కృష్ణ, నారగోని శ్రీనివాస్ యాదవ్, నాగిరెడ్డి, ఆదిలక్ష్మి, విజయ్, అనిత, రోహిత్, లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాయామంతో చక్కటి ఆరోగ్యం : ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** వ్యాయామంతో చక్కటి ఆరోగ్యం చేకూరుతందని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ వై.ప్రకాష్ రెడ్డి, మలక్‌పేట కేర్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్‌చంద్, డాక్టర్ అవినాష్ చైతన్యలు పేర్కొన్నారు. వరల్డ్ క్యాన్సర్ డే ను పురస్కరించుకుని కేర్ గ్రూప్ ఆధ్వ ర్యంలో చాదర్‌ఘాట్‌నుండి ఎంజిబిఎస్‌వరకు క్యాన్సర్ అవేర్ నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం సేవించడంతో వివిధ రకాల క్యాన్సర్లపై ప్రభావం చూపిస్తుం దన్నారు. నిత్యం వ్యాయామం చేయడంతోపాటు బరువును అదుపులో ఉంచుకోవాలనన్నారు. నగరంలో బ్రెస్ట్ క్యాన్సర్ అధికంగా ఉందని సర్వేలు చెబుతున్నాయన్నారు. క్యాన్సర్ నివారణకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహ్మద్ హాషీం, ప్రవీణ్‌కుమార్, మహ్మద్ అశ్ఫాఖ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

**అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** ఈ నెల 4వ తేదీన రాచకొండ కమిషనర్ డిఎస్ చౌహాన్ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తారామతిపేట గ్రామంలో వి ద్యార్థులకు, ఉపాధ్యాయులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ యొక్క దుష్ప్రభావాలు, రోడ్డు భద్రత, మానవ అక్రమ రవాణా, చైల్డ్ మారేజ్ మొదలగు అంశాల మీద ఎల్ఇడి స్క్రీన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామలింగం, ఎస్ఐ కర్ణాకర్‌రెడ్డి, రాచ కొండ కళాబృందం అరుణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి చొరవతోనే మీర్‌పేట్‌కు జూనియర్ కాలేజీ : మేయర్



జూనియర్ కాలేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన మేయర్ దుర్గ, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి చొరవతోనే మీర్‌పేట్‌కు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరై ప్రారంభమైందని మీర్‌పేట్ కార్పొరేషన్ మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డిలు స్పష్టం చేశారు. మీర్‌పేట్‌లో రూ.1.35 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవన నిర్మాణానికి మేయర్, డిప్యూటీ మేయర్‌లు కార్పొరేటర్లతో కలిసి శ్రీకారం చుట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ మీర్‌పేట్‌తోపాటు పరిసర ప్రాంతాల ప్రజలకు అందుబాటు లో కాలేజీ రావడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిష నర్ చిట్టి నాగేశ్వర్‌రావు, ఫ్లోర్ లీడర్లు అర్కల భూపాల్‌రెడ్డి, కీసర గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ ధరంకార్ జ్యోతి కిశోర్, జిల్లెల అరుణ ప్రభాకర్‌రెడ్డి, మేకల రవీందర్‌రెడ్డి, పసునూరి బిక్షపతిచారి, భీమ్‌రాజ్, పల్లె జంగయ్యగౌడ్, ప్రిన్సిపాల్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

## గుడిసెవాసులకు బ్లాంకెట్స్ పంపిణీ : మాజీ కార్పొరేటర్ స్వప్నసుందర్‌రెడ్డి



బ్లాంకెట్స్ పంపిణీ చేస్తున్న సామ స్వప్న సుందర్‌రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్న సుందర్‌రెడ్డి శనివారం సింగరేణి కాలనీలోని గుడిసెవాసులకు బ్లాంకెట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సామ స్వప్న మాట్లాడుతూ పదవి లో ఉన్నా లేకున్నా డివిజన్ వాసులకు ఎల్లవేళలా అందు బాటులో ఉంటామన్నారు. డివిజన్‌లోని సమస్యల పరిష్కా రానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చందునాయక్, కేశ్యానాయక్, సేవ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు బాలాపూర్‌లో వేణుగోపాల స్వామి కళ్యాణం

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** బాలాపూర్‌లోని చారిత్రక వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం సాయం త్రం స్వామి వారి కళ్యాణం జరుగుతుందని ఆలయ కమిటీ ఛైర్మన్ కొలన్ కృష్ణారెడ్డి తెలిపారు. సాయంత్రం 6.30 గంట లకు ఆలయఆవరణలోని మండపంలో వేణుగోపాల స్వామి కళ్యాణోత్సవం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కళ్యాణాన్ని వీక్షించి తరించాలని ఆయన కోరారు.

## మహిళలకు అండగా షాది ముబారక్, కళ్యాణలక్ష్మి పథకాలు : ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** షాది ముబారక్, కళ్యా ణలక్ష్మి పథకాలు మహిళలకు అండగా నిలుస్తున్నాయని మల క్‌పేట నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో ని అంబర్‌పేట, చార్మినార్ మండలాలకు చెందిన సుమారు 120 మంది లబ్దిదారులకు ఆయన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులుల శ్రీకాంత్, ఆసిఫ్‌ఖాన్, యూనుస్ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి ప్రభుత్వ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

**నేరెడ్‌మెట్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యా య విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థల చట్టాలపై, ఉచిత న్యాయ సహాయంపై విద్యార్థులకు అవగా హన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కార్యదర్శి రాజు, ప్రిన్సిపల్ జోతిర్మయి, సిబ్బంది పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి : సునీల్

**తుర్కయంజాల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రామిరెడ్డి సహాయ సహకారాలతో తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూరు పరిధిలోని 18వ వార్డు లోని రాజీవ్ గృహకల్పలో 34, 35వ బ్లాక్‌ల నుండి ఔట్‌లెట్ వరకు నూతన డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో కిషన్, భాస్కర్, నరసింహ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలను మార్చుకోవావాలి : శ్రీనివాస్‌గౌడ్

**నేరెడ్‌మెట్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** కేంద్ర,రాష్ట్ర ప్రభు త్వాలు అవలంబిస్తున్న విధానాలను మార్చుకోవాలని శనివా రం మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నేరెడ్‌మెట్ వాజ్‌పేయినగర్‌వద్ద ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేరెడ్‌మెట్ వాజ్‌పేయినగర్‌లో ఆర్‌యూబి పనులకు శంకుస్థాపన చేసి సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికి ప్రభుత్వం నుండి ఎటు వంటి స్పందన లేదన్నారు. నిత్యం ఈ రోడ్డుపై నుండి కొన్ని లక్షల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రైల్వేగేటు పడడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు, పాదాచారులు ఎంతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఎంఎంటీఎస్ పూర్తి అయితే 10నింలకు ఒక్కసారి గేటు పడడం ఖాయం అప్పుడు ట్రాఫిక్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుంది. ఇప్పటికై నా రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌యూబి నిర్మాణంపై దృష్టి సారించి త్వరగా పూర్తి చేయాలని వారు డిమాండ్ చేసారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ నాయకులు రామ్‌చందర్, శ్రీనివాస్‌గౌడ్, రెబ్బ వాసు, సాయిప్రసాద్, రాములు, శంకర్, బుచ్చిబబు, వేణు, నరసింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించి, మెరుగైన సదుపాయాలను కల్పించాలి



హాస్టల్‌లో బియ్యాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడంతో పాటు సరైన సదుపా యాలను కల్పించాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం ఆయన డివిజన్‌పరిధి సామనగర్‌లోని మైనారిటీ హాస్టల్‌ను సందర్శిం చి సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్ లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, పప్పులు, కూరగా యలను పరిశీలించారు. విద్యార్థుల గదులు, టాయిలెట్లను పరిశీలించారు. నాణ్యమైన విద్యను అందించాలని అధికారు లను ఆదేశించారు. అనంతరం కుమ్మరికుంటను పరిశీలించి పరిసర ప్రాంతాలలో చెత్తను వేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్తను స్వచ్ఛ ఆటోలలో మాత్రమే వేయాలని బహి రంగ ప్రదేశాలలో చెత్తను వేస్తే ఊరుకునేది లేదని కాలనీ వాసులను హెచ్చరించారు. కాలనీవాసులు బాధ్యతగా వ్యవ హరించాలని లేనిపక్షంలో జరిమానాలను విధిస్తామన్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది సైతం కుమ్మరికుంట పరిసరాలను ఎప్పటికపుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు.

## క్యాన్సర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి: చిగిరింత పారిజాత



క్యాన్సర్ డేను ప్రారంభించిన ప్రసంగిస్తున్న చిగిరింత పారిజాత

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** క్యాన్సర్ల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని బడంగ్ పేట్ మున్సిపల్‌కార్పొరేషన్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్య దర్శి చిగిరింత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని చవాన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రపం చ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ నేటి కాలంలో క్యాన్సర్ రోగులు పెరుగుతుండ డం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే ప్రాణాంతకం ఏమీ కాదనీ ఈ నేప థ్యంలో డాక్టర్ల సూచనల మేరకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహిం చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బండారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పథంలో నడిపిస్తా : బొంతు



మాజీ మేయర్ రామ్మోహన్‌ను కలిసిన కాలనీ కార్యవర్గం

**కుషాయిగూడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి అభివృద్ధి పథంలో నడిపించడానికి తమవంతు సహకారం అందిస్తామని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్ వివిఎన్ రెడ్డి నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సబ్బిడి శ్రీనివాస్ రెడ్డి బృందం వారిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతం లో చర్లపల్లి డివిజన్లో 200 కోట్ల రూపాయల వ్యయంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు రాంరెడ్డి ఉపాధ్యక్షులు వాస దేవారెడ్డి సభ్యులు లక్ష్మీనారాయణ, బుచ్చిరెడ్డి, బాల్రెడ్డి, లక్ష్మణ్‌సింగ్, రామచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, సూర్య భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ కార్యక్రమంలో అందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలి : సామ



చెత్తను తొలగిస్తున్న సామ రంగారెడ్డి, పవన్‌కుమార్

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** కాలనీలలో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి పేర్కొన్నారు. కొత్తపేటడివిజన్ మోహన్‌నగర్‌లోని జనప్రియ అపార్ట్మెంట్స్ వద్ద శనివారం సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛ్‌ఎల్బినగర్ కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట కార్పొ రేటర్ పవన్‌కుమార్‌తో కలిసి అపార్ట్మెంట్ చుట్టుప్రక్కల చెత్తాచెదారాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిహెచ్ఎంసిలో పూర్తిగా కమీషన్‌ల కోసం రాంకీ సంస్థకు పారిశుద్ధ్య పనులు అప్పగించారని, క్షేత్ర స్థాయిలో మున్సిపల్ కార్మికులను పెంచకుండా కంపెనీలకు పనులు అప్పచెప్పడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందన్నా రు. జిహెచ్ఎంసి రూ.5వేల కోట్లను బిఆర్ఎస్ ప్రభుత్వం మింగేసిందన్నారు. పారిశుద్ధ్య కార్మికులపై పెత్తనం చేలాయి స్తున్న రాంకి కాంట్రాక్టర్లు చెత్త పెరుకపోతుంటే పారిశుద్ధ్య కార్మికులను వేధిస్తున్నారు తప్ప సిబ్బంది ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా అధికారం ప్రతినిధి ఎలిమినేటి జంగారెడ్డి, గీతారెడ్డి, సుందర్‌నారాయణ, అశ్విన్‌సింగ్, మంచి రాజేష్, ఉపేందర్ సింగ్, శ్రీనివాస్‌రెడ్డి, యూ.రామకృష్ణ, కొత్త తిరుమల్, గట్టు మహేష్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## లబ్దిదారులకు సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ : ఎమ్మెల్యే బేతి



సిఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి

**ఉప్పల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి నిరు పేదలకు ఒక వరంలాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభా ష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం హబ్సిగూడలో జరిగిన కార్యక్రమంలో పలువురు లబ్దిదారులకు సిఎం సహా యనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని, అనారోగ్యంతో బాధపడుతు న్న పేదలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు. ఈ సందర్భంగా లబ్దిదారులు శ్రీనివాస్‌కు రూ.60వేలు, ఎం.డి.ఖాజాకు రూ.60వేలు, నజీరుద్దీన్‌కు రూ.58వేలు, శివాజీకి రూ.35వేలు, ఉమాదేవికి రూ.24వేలు, తేజశ్రీకి రూ.20వేలు, అరుణకు రూ.16వేలు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్, వేముల సంతోష్‌రెడ్డి, ముత్యంరెడ్డి, శివ, రఘు, అశోక్, మల్లేష్, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఒత్తిడి లేని ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని అలవర్చాలి: కార్తికేయ



వార్షికోత్సవ వేడుకల్లో ప్రసంగిస్తున్న సినీ హీరో కార్తికేయ

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** బాల్యం నుండే విద్యా ర్థులకు ఒత్తిడిలేని విధంగా ఆరోగ్యకరమైన పోటీ తత్వాన్ని అవవర్చాలని సినీ హీరో కార్తికేయ పిలుపునిచ్చారు. మీర్‌పేట్ లోని నాగార్జున మాంటిస్సోరి, ఐఐటి ఒలంపియాడ్ పాఠశా ల 10వ వార్షికోత్సవం కనుల పండువగా జరిగింది. ఈ సం దర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కార్తికేయ మాట్లాడుతూ క్రమశిక్షణతో నిబద్ధంతో విద్యను అభ్యసించే విధంగా విద్యా ర్థులను తీర్చిదిద్దితే వారు చక్కని భావి భారత పౌరులవు తారన్నారు. విద్యా సంస్థల ఛైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, భావ వ్యక్తీకరణ పెంపొందించడానికి తమ విద్యా సంస్థలు కృషి చేస్తున్నాయ న్నారు. కాగా గత ఏడాది పదవ తరగతి పరీక్షల్లో 10 జిపిఎ పాయింట్లు సాధించిన 12 మంది విద్యార్థులకు ఐదు వేల చొప్పున ప్రోత్సాహకాలను, జ్ఞాపికలను ప్రదానం చేశారు. అయితే చిన్నారులు ప్రదర్శించిన వెంకటేశ్వర కళ్యాణం, దశా వతారాలు, శివ తాండం, హనుమాన్ నృత్య ప్రదర్శనలు విశేషం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ రజనీ విఠల్‌రెడ్డి, డైరెక్టర్ లోహితా కార్తికేయ రెడ్డి, సిఎఓ శేషారావు, అకాడమిక్ డీన్ రాజశేఖర్, ప్రిన్సి పాల్ మహేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇళ్ల స్థలాలను ఇవ్వాలి : చాడ వెంకట్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

**హయత్‌నగర్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** అర్హులైన పేదలందరి కీ ఇళ్ల స్థలాలను మంజూరు చేయడంతో పాటు ఇంటి నిర్మా ణానికి 5లక్షల రూపాయలు అందించాలని సీపీఐ జాతీయ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ కుంట్లూర్ గ్రామ పరిధిలో సీపీఐ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న భూపోరాట క్షేత్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టచేత పట్టుకుని వేరువేరు నగరానికి వలస వచ్చిన పేద ప్రజలు ఇంటి అద్దెలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నగరానికి చుట్టూరా ఎన్నో పేద బస్తీలను ఏర్పాటు చేసి ఘన చరిత్ర సీపీఐకొ ఉందన్నారు. కుంట్లూర్ సర్వేనెంబరు 215 నుంచి 224 వరకు భూదాన భూమిలో గుడిసెలు వేసి 14 రోజులు కావస్తోందని పేదలు కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆందో ళన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని సదు పాయాలు కల్పించాలన్నారు. ఇళ్ల స్థలాల కోసం పేదలు కొనసాగిస్తున్న భూపోరాటం విజయవంతం అవుతుందని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, నాయకులు పల్లెనర్సింహ, సామిడి శేఖర్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, చందునాయక్, హరిసింగ్‌నాయక్, వేణుగోపాల్, ఏర్పుల నర్సింహ, నవనీత, అరుణ, దేవమ్మ పాల్గొన్నారు.

## మార్కెట్‌లో మెరుగ్గా పారిశుద్ధ్య నిర్వహణ : అనితానాయక్



పారిశుద్ధ్య పనులను ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్ అనితానాయక్

**మలక్‌పేట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉందని నగర వ్యవసాయమార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ అనితానాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ ఎన్నో యేళ్ల నుండి ఎదురుచూస్తున్న చెత్త సమస్య పరిష్కారమైందని తెలిపారు. మార్కెట్‌లో పారిశుద్ధ్య నిర్వహణకోసం జిహెచ్ ఎంసికి నెలకు రూ. 3లక్షలు చెల్లించడానికి ఒప్పందం చేసు కున్నారని తెలిపారు. చెత్త తరలింపులో నిర్లక్ష్యం వహిస్తే కాం ట్రాక్టు రద్దు చేస్తామని తెలిపారు. చెత్త తరలింపుతో వ్యాపా రులు, రైతులు, వినియోగారులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో బట్కిరి విద్యానంద్, అభిషేకం, నరేష్, సల్మాన్, రవికాంత్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు



భరత నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు

**ఉప్పల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామం లో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శని వా రం భరతనాట్య గురువు కౌముది అకాడమీ రాజ్యలక్ష్మి శిష్య బృందంచే భరత నాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సంద ర్భంగా మెల్లరి గణేశాస్తుతి, నర్తన గణపతిమ్, కౌతం మకత మణిమయ, భోశంభో దశావతారం, రామదాసు కీర్తన, హను మాన్ చాలీసా, తిల్లాన, మహిషాసుర మర్ధిని, సాయి పల్లకి కురవంజి తదితర అంశాలను కళాకారులు కావ్య, దివిజ, వైనవి, కృష్ణప్రియ, సౌమ్య, శ్రీనిధి, సహస్ర, జాహ్నవి, అక్షర, హర్షిని, ప్రణతి, పూర్వీక తదితరులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. శనివారం సెలవుదినం కావడంతో సందర్శ కుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వాహకులు తెలిపారు.

## అభివృద్ధి పథంలో చిలుకానగర్ : కార్పొరేటర్ బన్నాల గీత



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత ప్రవీణ్

**ఉప్పల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తు న్నామని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం డివిజన్ పరిధిలోని బాలేందర్‌షాపు నుంచి మల్లికార్జుననగర్‌వరకు చేపడుతున్న కొత్త సిసి రోడ్డు పనుల ను ఎఇ రాజ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భం గా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని, సమ స్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నా రు. బస్తీలో సిసి రోడ్డు పనులు నిర్వహించడంతో స్థానికుల ఇబ్బంది తొలుగుతుందన్నారు. సివరేజీ పనులు పూర్తయిన వెంటనే సిసి రోడ్డు వేస్తామన్నారు. ప్రజలకు మౌళిక సదుపా యాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నా రు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, కొక్కొండ జగన్, సుందర్, బాలేందర్, బాలు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 11న నేషనల్ లోక్ అదాలత్ పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జడ్జి సురేష్

**నేరెడ్‌మెట్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** ఈ నెల 11వ తేదీనా దేశవ్యాప్తంగా నిర్వహించే నేషనల్ లోక్‌అదాలత్‌లో పెండింగ్ లో ఉన్న కేసులను ఇరుపక్షాలు సామరస్యంగా పరిష్కరించు కోవచ్చని మేడ్చెల్ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి సురేష్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రింకోర్టు ఈ నెల 11వ తేదీనా నేషనల్ లోక్‌అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. పెండింగ్ కేసులను ఇరుపక్షాలతో చర్చించి పరిష్కరించవచ్చున్నారు. సమయం, డబ్బు వృధా కాకుండా కేసులను పరిష్కరించు కోవాలన్నారు. కోర్టుల చుట్టు తిరుగుతూ తమ విలువైన సమయాన్ని కేసుల కోసం వృధా చేసుకోవద్దన్నారు. ఇప్పటికే అందరికి నోటీసులు పంపించడం జరిగిందన్నారు. నోటీసు లు అందని వారు ఈ నెల 11వ తేదీనా సంబంధిత కోర్టులో సరైన ద్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమం లో లీగల్ సర్వీసెస్ అధారటీ సెక్రటరీ శంకర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## పార్కును వెంటనే నిర్మించాలి: మందుల

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** కాలనీలో పార్క్ కోసం కేటాయించిన స్థలంలో పార్కు నిర్మాణం పనులు వెం టనే చేపట్టాలని సరూర్‌నగర్‌డివిజన్ లక్ష్మీనగర్‌కాలనీ ప్రధాన కార్యదర్శి మందుల శ్రీధర్‌రాజ్ విజ్ఞప్తి చేశారు. లక్ష్మీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతనిధుల ఆధ్వర్యంలో శని వారం సరూర్‌నగర్ ఉప కమినర్ హరికృష్ణయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రభుత్వం కాలనీకి కేటాయించిన స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని పార్క్ నిర్మించాలని న్యాయస్థానం తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. పార్క్ నిర్మాణ పనులు చేపట్టాల ని జోనల్ కమిషనర్ పంకజ, ఇంజనీరింగ్ విభాగం అధికా రులకు కూడా వినతి పత్రాలు అందజేశామని తెలిపారు.

## అట్టహాసంగా ప్రీమియర్ లీగ్ సీజన్ -2 ప్రారంభం



ప్రీమియర్ లీగ్ సీజన్ -2 ప్రారంభిస్తున్న సత్తయ్య తదితరులు

**తుర్కయంజాల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రీమియర్ లీగ్ సీజన్ -2 శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కొద్దిసేపు బ్యాట్ పట్టి సిక్స్‌లు బాది హల్ చల్ చేశారు. ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తితో మెలగాలని, టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని పిలు పునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ స్కూల్ అధినేత పురుషోత్తంరెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజర్ గౌని ప్రశాంత్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.